నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com



పైసలిస్తేనే.. పర్మిషన్..!

ఇంటికో రేటు.. అపార్ట్‌మెంట్ కో ధర

అడుగడుగున అవినీతి పెరిగిపోతుంది. పైసలు ఇవ్వనిదే పని జరిగే పరిస్థితి ఏ ప్రభుత్వ కార్యాలయంలో కూడా కనిపించడం లేదు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మాదిరిగానే మున్సిపల్ కార్యాలయంలో కూడా అవినీతి రాజ్యమేలుతుంది. ముఖ్యంగా మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులు అందిన కాడికి దోచుకుంటున్నారు. ఒక దశలో బోర్డు పెట్టకపోయినా పైసలు ఇస్తేనే పర్మిషన్ అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఇంటికో రేటు, అపార్ట్‌మెంట్ కో ధర నిర్ణయించి మరి వసూలు చేస్తున్నారు. పర్మిషన్‌కు అన్ని ధ్రువీకరణ పత్రాలు సరిగ్గా ఉన్నప్పటికీ అధికారులకు మామూలు ఇవ్వకుంటే అనుమతులు దొరకవు అనే రీతిలో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఖాళీ స్థలాల్లో కార్ల, బైక్ ల మేళ పెట్టినప్పుడు పెద్ద ఎత్తున డబ్బులు తీసుకొని అనుమతులు ఇస్తున్నారని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఎలాగైనా మామూలు ఇస్తేనే తప్ప పర్మిషన్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గ్రేడ్ వన్ గా ఉన్న మిర్యాలగూడ మున్సిపాలిటీలో సరిపడా సిబ్బంది లేకపోవడం ఉన్న ఇద్దరు అధికారులకు కలిసి వచ్చింది. దీంతో ఈ శాఖలో లక్షలు చేతులు మారుతున్నట్లు ఆ కార్యాలయంలోనే అధికారులు గుసగుసలాడుతున్నారు.

- మధ్యవర్తిదే కీలక పాత్ర
- లక్షలు ఆర్జిస్తున్న అధికారులు
- కాసులు కురిపిస్తున్న అనుమతులు

పట్టణంలోని బంగారిగడ్డలో నూతనంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణదారుడు ఇంటి పర్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అన్ని కాగితాలు సమర్పించి అవసరమైన పన్నులు చెల్లించారు. ఆన్‌లైన్ పర్మిషన్ అప్రూవల్ చేసేందుకు నెల రోజులుగా తిరుగుతున్నాడు. పైసలు ఇవ్వని కారణంగా అతనికి ఇప్పటివరకు పర్మిషన్ దొరకలేదు.

- ఓ బాధితుడు

పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ లో నార్కెట్ పల్లి- అద్దంకి బైపాస్ సమీపంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. ప్లానింగ్ ప్రకారం నిర్మాణం చేస్తుండగా అనుమతి కోసం ప్లానర్ వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. టాక్స్ ఇతర ఫీజులన్నీ సక్రమంగానే చెల్లించారు. తీరా మున్సిపల్ అధికారులు అప్రూవల్ చేసే సమయంలో కొన్ని రోజులు తిప్పించుకున్నారు. చివరికి 10వేలు ముట్టజెప్పితే పర్మిషన్ ఇచ్చారు.

-మరో బాధితుడు

నవతెలంగాణ-మిర్యాలగూడ

రోజురోజుకు విస్తరిస్తున్న మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇంటి, షాపింగ్, అపార్ట్‌మెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడం, మంచి రోజులు ఉండడంతో నిర్మాణాలు జోరందుకున్నాయి. మిర్యాలగూడ మున్సిపాలిటీలో పర్మిషన్ కోసం నెలకు 25 నుంచి 30 దరఖాస్తులు వస్తున్నాయి. గత సంవత్సర కాలంగా 300 నుంచి 400 నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చినట్టు సమాచారం. వ్యక్తిగత ఇండ్లకు కింది పోర్షన్ కు అయితే రూ.6 నుంచి 8 వేలు, జి ఫ్లెస్ అయితే రూ.10 వేలకు తగ్గకుండా, షాపింగ్ కాంప్లెక్స్ కు వేల రూపాయలలో, అపార్ట్‌మెంట్ కు రూ.2 లక్షల నుంచి 3లక్షల వరకు తీసుకుంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కట్టిన ఇండ్లకు అనధికారికంగా వేలాది రూపాయలు తీసుకొని పర్మిషన్లు ఇస్తున్నారని ఆరోపణలున్నాయి. పట్టణంలో ఉన్న లైసెన్స్ మధ్యవర్తుల ద్వారా ఈ తతంగం నడుస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో పట్టణంలో ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణ సమయంలో పర్మిషన్ కోసం అన్ని పత్రాలు సక్రమంగా సమర్పించిన రెండు లక్షలు ఇస్తేనే పర్మిషన్ ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే ప్రతినెల ప్రణాళిక విభాగంలో లక్షలు చేతులు మారుతున్నట్టు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.



మిర్యాలగూడ మున్సిపాలిటీ

కలిసొచ్చిన సిబ్బంది కొరత

అభివృద్ధి చెందిన మిర్యాలగూడ పట్టణం రోజు రోజు విస్తరిస్తుంది. బహుళ అంతస్తులు, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. దీనికిగాను మున్సిపాలిటీలో ఒక టిపిఎస్ ఒక టిపిఓ ఇద్దరు టీపీబీవోలు తోపాటు కిందిస్థాయి సిబ్బంది ఉండాలి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఏ రోజు కా రోజు క్షేత్రస్థాయిలో పరిశీలీన జరిపి అనుమతులు మంజూరు చేయాలి. కానీ సిబ్బంది కొరత, ఉన్న అధికారులకు పూర్తిగా అవగాహన లేకపోవడంతో ఈ విభాగంలో అనేక తప్పిదాలు జరుగుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఉన్న అధికారులు రెండు మున్సిపాలిటీలకు ఇన్చార్జి బాధ్యతలు ఉండడం వల్ల క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. నేరుగా డబ్బులు తీసుకొని పర్మిషన్ ఇస్తున్నారనే ప్రచారం ఉన్నది. వారంలో మూడు రోజులు ఇక్కడ డ్యూటీ చేస్తే మరో మూడు రోజులు వేరే మున్సిపాలిటీలో విధులు నిర్వహించడం వల్ల ఆ శాఖలో పర్యవేక్షణ లోపం తీవ్రంగా కన్పిస్తుందని, ఎప్పుడు వెళ్లినా అధికారులు అందుబాటులో ఉండరని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.



నా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటా
-కమిషనర్ ఎండి .యూసుఫ్

పట్టణ ప్రణాళిక విభాగం లో పైసలు ఇస్తేనే పర్మిషన్ ఇస్తున్నారనే విషయం ఆ దృష్టికి రాలేదు. ఒకవేళ ఫిర్యాదు అందినా, దృష్టికి వచ్చినా విచారించి చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పుడు అన్ని పత్రాలు సక్రమంగా సమర్పిస్తే పర్మిషన్ ఇచ్చేస్తాం. దీని కోసం ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బులు అడిగితే నా దృష్టికి తీసుకురండి.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం బంద్

- 48 గంటలపాటు సైలెన్స్ పీరియడ్
- ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 వ సెక్షన్ అమలు
- బల్క్ ఎస్ఎంఎస్ లు పంపడం నిషేధం
- ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఈ నెల 27న జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్)అమలులో ఉంటుందని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ,నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సాయంత్రం 4.00 గంటల నుండి 27వతేదీ సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం, ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం జరిగిందని పేర్కొన్నారు.

బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపడం నిషేధం.

సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సైలెన్స్ పీరియడ్ లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం జారీ చేయబడిన సూచనలు, ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లా యేతర వ్యక్తులు ఎవరు జిల్లాలో ఉండవద్దని స్పష్టం చేశారు. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెక్షన్ 126(1)(బి) ఆర్పీ యాక్ట్ 1951 ప్రకారం ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని వెల్లడించారు.ఎన్నికలు పూర్తయ్యే వరకు144 వ సెక్షన్ అమలు అలాగే మంగళవారం సాయంత్రం 4 గంటల నుండి గురువారం సాయంత్రం 4 గంటల వరకు మద్యం అమ్మకాలపై నిషేధం ఉంటుందని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నిర్వహించే మార్చి 3 న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు నల్గొండ మున్సిపాలిటీ పరిధిలో మద్యం అమ్మకాలపై నిషేధం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికలు నిర్వహించే ఆయా జిల్లాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని కోరారు.

రాజవరానికి పల్లె వెలుగు బస్సులు నడపాలి



నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

మండల కేంద్రం నుంచి రాజవరం వరకు పల్లె వెలుగు బస్సులు నడపాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వేములకొండ పుల్లయ్య ,మాజీ సర్పంచ్ పోలెపల్లి సైదమ్మ ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ గ్రామ ప్రజలు ఆగ్రామంలో ఈనెల 26నుండి 28 వరకు జరిగే మల్లప్ప జాతరకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నల్గొండ జిల్లా కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు హైదరాబాద్ నుండి ,ఆంధ్రా నుంచి అలాగే వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారని అన్నారు. జాతరకు నల్గొండ, మిర్యాలగూడ, డిపోల నుంచి బస్సులు నడపాలని అన్నారు. కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అందిస్తున్నా , ప్రతి పల్లెకు పల్లె వెలుగు నడపలేక పోవడంతో గ్రామీణ మహిళలకు అందని ద్రాక్ష గా ఈ పథకం మారడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామశాఖ కార్య దర్శి బుర్రి సైదయ్య ,యుటిఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాందుపాషా , చెన్నబోయిన చినలక్ష్మయ్య చింతకాయల వెంకన్న ,పిల్లి మల్లికార్జున్ ,లక్ష్మయ్య, కామేశ్వరి ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-దామరచర్ల

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ డిమాండ్ చేశారు. సోమవారం మండలం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశం నాగ మల్లయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీల లో పనిచేస్తున్న సిబ్బందికి గత నాలుగు, ఐదు నెలల నుండి వేతనాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. అనారోగ్య కారణంగా రెండు ,మూడు రోజులు సెలవు పెడితే వారికి జీతాలు కట్ చేస్తున్నారని అన్నారు. వేతనాలు కట్ చేయడం అనేది సరైన పద్ధతి కాదని అన్నారు. ముఖ్యంగా కొంతమంది కార్యదర్శులు సిబ్బందిని మర్యాద లేకుండా మాట్లాడటం జరుగుతుందని వాపోయారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా పాతిలోకి విజయకుమార్, వీర్లపాలెం ఉపాధ్యక్షులు గందు వెంకటేశ్వర్లు ,తాళ్లవేరగూడెం ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి సైదులు ,కొండ్రపోల్ రామావత్ నాగు ,గణేష్ పాడు కోశాధికారి ముడుసు సైదులు దామరచర్ల 10 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీడీవో ఆఫీకార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ మహమ్మద్ జైరుద్దీన్ , ప్రేమమ్మ జ్యోతి, మున్నోతు మారు ,పాతులోతు రాము ,మిడతపల్లి లలిత మేడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





ప్రజలు సంతోషంగాతో ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నవతెలంగాణ-కేతపల్లి

యాదవుల ఇలవేల్పు గంగా దేవమ్మ తల్లి ఆశీర్వాదంతో ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ,ఆయురారోగ్యాలతో జీవించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని కొర్లపాడు గ్రామంలో సోమవారం గంగ దేవమ్మ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకటరెడ్డి మాజీ సర్పంచ్ బడుగుల శ్రీనివాస్ యాదవ్ వి ఆర్ ఎస్ వి మండల అధ్యక్షుడు వంటల చేతన్ కుమార్ , నాయకులు ,సైదిరెడ్డి ,సత్యనారాయణ , యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన శ్రీ వర్ష

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన సందినేని శ్రీవర్షరావు టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది. శ్రీవర్ష హైదరాబాద్ లోని మియాపూర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 13న కిలిమంజారో పర్వత శిఖరంపై జాతీయ జెండాను ప్రదర్శిం చిందని ఆమె తండ్రి సందినేని రవీందర్రావు తెలిపారు. పర్వతారోహణ చేసిన శ్రీవర్షరావును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామా రావు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందించారు. చిన్నతనంలోనే పర్వతశిఖరాన్ని అధిరోహించిన శ్రీవర్షరా వుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సందినేని వెంకటేశ్వర రావు, మంగళపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ప్రగడపు నవీన్ రావు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- డీఆర్ఓకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి



నవతెలంగాణ-మిర్యాలగూడ

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి.అయూబ్ డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంత వరకు ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదన్నారు. జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వకుండా జీవో 239 సమీక్ష, సవరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నదన్నారు. దీంతో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదన్నారు.జిల్లా వ్యాప్తంగా ఈనెలనెల25 నుంచి మార్చి 25 వరకు నెల రోజుల పాటు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు ఖాజా హమీదోద్దీన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు జీ.మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకన్న, జిల్లా నాయకులు ఖాజా నాజిమోద్దీన్, సాదాత్ అలీ, వరుణ, శేఖర్ రెడ్డి, ఇబ్రహీం, సైదులు, మహేష్ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మంద సైదులు, జయరాజు, అరుణ్ వేణు ప్రసాద్, నక్క శ్రీను,నర్సింహ సైదులు, రాం ప్రసాద్, ప్రసాద్, సైదులు, మహేష్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన సన్ షైన్ విద్యార్థులు

నవతెలంగాణ-చండూరు

జిల్లా కేంద్రంలో జరిగిన షోటో ఖాన్ కరాటే రాష్ట్ర స్థాయి వారియర్ కప్ ఆఫ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక సన్ షైన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఫిదియాన్, సౌధ్, మాల్విక్ అత్యుత్తమ ప్రదేశాలను కనబరచి రాష్ట్రస్థాయిలో ఫిథియాన్ రెండవ బహుమతి, సౌధ్ , మాల్విక్ సంయుక్తంగా మూడో బహుమతిని గెలుపొందారు. సోమవారం ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న వారిని అభినందిస్తూ సన్ షైన్ విద్యార్థులు చదువులతో పాటు ఆటలలో కూడా అగ్రస్థానంలో రాణిస్తారు అనడానికి కరాటే పోటీ నిదర్శనమన్నారు. కరాటే ఆత్మరక్షణలో భాగం మాత్రమే కాదంటూ మానసిక ఉత్తేజాన్ని కలిగిస్తూ భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించడానికి సహాయపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణ కలిగి ఉండడం ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ రవి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ , ప్రిన్సిపల్ రవికాంత్, ప్రవీణ్, లతీఫ్ పాషా, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



తల్లిదండ్రుల ప్రాణాలను కాపాడండి

- కూతుర్ల ఆవేదన, కలెక్టర్ కు వినతి



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన కోడలు పది ఎకరాల భూమిని స్వాధీన పరుచుకుని పట్టించుకోవడంలేదని తల్లిదండ్రుల ప్రాణాలను కాపాడాలని కోరుతూ ముగ్గురు కుమార్తెలు కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను ఆశ్రయించిన సంఘటన సోమవారం నల్లగొండలో చోటుచేసుకుంది. హాలియ మండలం ఇబ్రహీంపట్నం కు చెందిన సాయిలు,వెంకటమ్మలకు ఒక కుమారుడు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. 23 ఏండ్ల క్రితం కుటుంబ కలహాలతో కుమారుడు యాదయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో సాయిలు వెంకటమ్మలు తమకున్న పది ఎకరాల భూమిని .కోడలు సుమలత పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. నాటి నుంచి నేటి వరకు తల్లిదండ్రులను పట్టించుకోవడంలేదని, తమ తల్లి వెంకటమ్మకు బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ జరిగిందని సుమారు రూ.25 లక్షల ఖర్చు వచ్చింది అని కుటుంబ పోషణ, వారి ఆరోగ్యం పట్ల కోడలు పట్టించుకోవడంలేదని వెంకటమ్మను రెండు చేతుల మీద ఎత్తుకొచ్చి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు గోడు వినిపించుకున్నారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన ఫిర్యాదు పై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఐసీడీఎస్ అధికారులకు ఆదేశించారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్



నవతెలంగాణ-క్లాక్‌టవర్


ప్రభుత్వం నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ కోరారు. నిరుగ్యోభృతి ఇవ్వాలని కోరుతూ సోమవారం పట్టణంలోని నాగార్జున కళాశాల ఎదుట గా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డు రాశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంబటి ప్రణీత్, చేదుబుడ్డి రాంబాబు, కందుల సంపత్,పాక సాయి,రాజు,రాకేష్,వెంకన్న తడితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న ఏలేశ్వరం కొండ

- వేల సంవత్సరాల క్రితమే దక్షిణ కాశీగా ప్రసిద్ధం

నవతెలంగాణ-నాగార్జునసాగర్

ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న మల్లయ్య గట్టుగా పిలవబడే ఏలేశ్వరం కొండ ముస్తాబవుతుంది. కొన్ని వేల సంవత్సరాల క్రితమే దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం ఏలేశ్వరం కొండ. ఎన్నో సంవత్సరాలుగా పాలకుల నిర్లక్ష్యానికి అద్దంగా నిలిచి ఎటువంటి పూజలు నోచుకోలేని ఈ దేవాలయం రెండు దశాబ్దలా కాలంగా ఒక మహాశివరాత్రికి మాత్రమే పూజలకు, భక్తుల దర్శనానికి నోచుకుంటుంది. సాగర్ జలాశయం మధ్యలో నాగార్జున కొండకు సమీపాన ఉన్న ఏకైక ప్రసిద్ధమైన కొండ ఏలేశ్వరం. శ్రీశైలం నుండి వచ్చే కృష్ణమ్మకు స్వాగతం పలుకుతున్నట్టుగా ఈ కొండ నది ముఖం గా ,అత్యంత ప్రకృతి సౌందర్యాన్ని కలిగి రెండు గుట్టలు ఉన్న ఏకైక కొండగా కనిపిస్తుంది .నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణానికి ముందు వరకు కూడా నిత్య పూజలు అందుకున్న ఈ పుణ్యక్షేత్రం సాగర్ నిర్మాణం పూర్తవడంతో ఆదరణను కోల్పోయింది. డ్యామ్ నిర్మాణానికి ముందు చేపట్టిన తవ్వకాలలో ఏలేశ్వరం కొండ సమీపంలో లభ్యమైన చారిత్రక శాసనాలు, దేవతామూర్తులు పురావస్తు శాఖ మ్యూజియాలలో తోపాటు పలు ప్రాంతాలలో వెయ్యిల ఏళ్లనాటి సజీవ చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. మహాయాన బౌద్ధ మతానికి నిలయముగా, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన బౌద్ధ విశ్వవిద్యాలయానికి నిలయమై ఆధ్యాత్మిక అనుబంధం కలిగిన నాగార్జున కొండకు సమీపాన ఉన్న ఏలేశ్వరం కొండ నేటికీ పూర్తిస్థాయిలో ప్రచారానికి, అభివృద్ధికి నోచుకోకపోవడం విచారకరం. కాత్యాయనీ దేవి సహిత మల్లికార్జున స్వామి ఆలయాలతో కూడిన ఏలేశ్వరం మల్లన్న గుట్ట మహిమలు గల ప్రదేశమని నేటికి భక్తులు చెప్పుకుంటారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజుల వరకు కూడా ఆదరణ పొంది పూజలు అందుకున్న ఏలేశ్వరం కొండ ఈ ప్రభుత్వాలు గానీ దేవాదాయ శాఖ గానీ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురవుతుంది. మహాశివరాత్రి రోజున నాగార్జునసాగర్ హిల్ కాలనీ నుండి ఏలేశ్వరం కొండకు పర్యాటక శాఖ పర్యటక లాంచీలను నడుపుతుంది. దీనికి గాను పిల్లలకు 200 రూపాయలు పెద్దలకు 250 రూపాయలు రానోపోను టికెట్ ధరగా నిర్ణయించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఏలేశ్వరం మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చినరాములు తెలిపారు.



శాలిగౌరారం ప్రాజెక్టులో మట్టి తవ్వకాలు

నవతెలంగాణ-నకిరేకల్

శాలిగౌరారం ప్రాజెక్టులో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. సోమవారం ప్రాజెక్టు వైపు నుండి అటుగా వెళ్తున్న నవ తెలంగాణ కంట మట్టి తవ్వకాలు జరుగుతున్న దృశ్యం కనపడింది. ఇదే విషయంపై ఐబీ ఏఈ రాములు ను వివరణ కోరగా తవ్వకాలు జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, పరిశీలించి సంబంధిత సంబంధికులపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని నవ తెలంగాణకు తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సూర్యాపేట
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com

టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ-నూతనకల్



నల్గొండ, ఖమ్మం.,వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పూర్వ ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు కందాల శంకర్ రెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలో లింగంపల్లిలో ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పూర్వ విద్యార్థి నాయకులు బత్తుల జనార్ధన్ బుల్లెద్దు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-మఠంపల్లి




క్షయ వ్యాధి నిర్మూలనపై సోమవారం మండలంలోని సాగర్ సిమెంట్స్‌లో పరిశ్రమ వైద్యాధికారి నిర్మల కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర గనులు మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణ నిర్మూలనపై 7 డిసెంబర్ 2024 నుండి 23 ఫిబ్రవరి 23 వరకు 100 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా సాగర్ పరిశ్రమ కాలనీలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు వ్యాధి వ్యాప్తికి గల కారణాలు నివారణ చర్యలను వివరించామని తెలిపారు. కాలనీ వాసులచే నిక్షయ ప్రతిజ్ఞ చేయించారు. క్షయ వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు వి సుబ్రహ్మణ్యం, ఏవిపి మైండ్స్ ఎం హేమంత్ కుమార్, డీజీఎం హెచ్ ఆర్, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే సీఎంఆర్ బకాయిలు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

జిల్లాలో కొంతమంది పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు పరస్పర సహకారంతోనే సీఎంఆర్ బకాయిలు పూర్తిస్థాయిలో వసూలు కావడం లేదనేటటువంటి చర్చ సర్వత్రా నడుస్తోంది. సీఎంఆర్ బియ్యం బకాయిలను ప్రతి సంవత్సరం సీజన్ల వారిగా బకాయిలు లేకుండా సీఎంఆర్ కేటాయించిన రైసు మిల్లుల నుండి సేకరించాల్సిన సివిల్ సప్లై అధికారులు ఉదాసీనతతో నిర్లక్ష్యంతో నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో రైస్ మిల్లర్లకు అధికారుల వైఖరి వరంగా మారింది ఏ సీజన్ బకాయిలు ఆ సీజన్లో వసూలు చేయాల్సి ఉండగా అది జరగటం లేదు. సీఎంఆర్ బకాయిలు పడ్డ రైస్ మిల్లర్లు సివిల్ సప్లై అధికారుల అలసత్వాన్ని అవినీతిని ఆసరాగా తీసుకొని మొత్తం బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడం లక్షల రూపాయలు గడిస్తున్నారు. ఈ విషయం సివిల్ సప్లై అధికారులకు తెలిసినప్పటికీ తమ వాటా తమకు అందుతుందని ఆలోచనతో ఉన్నారే తప్ప ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందనే విషయాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం వలన రైస్ మిల్లర్లకు సివిల్ సప్లై అధికారుల పట్ల భయము భక్తి లేకుండా పోయింది. అధికారులు మిల్లులో బియ్యం లేకుండా ఉన్నట్లు నివేదికలు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలోని ఎనిమిది మంది మిల్లర్లు దాదాపు రూ.500 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం అధికారులకు స్పష్టంగా తెలిసినప్పటికీ నోటీసులు ఇవ్వడం కేసులు పెట్టడం మినహా బకాయిలు వసూలు చేయడానికి మరో విధమైనటువంటి ప్రయత్నం చేయలేకపోయారు. మిల్లులో బియ్యం కూడా లేవు. జిల్లాలో ఐకెపి కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం పౌరసరఫరాల అధికారులు మిల్లులకు కేటాయించారు. మిల్లింగ్ చేసి 100 కిలోల బియ్యానికి 67 కిలోల బియ్యం సీఎంఆర్ కు అప్పగించాల్సి ఉంటుంది. అందుకు మిల్లర్లకు ప్రభుత్వం కష్టం చార్జీలను చెల్లిస్తుంది. వచ్చిన బియ్యాన్ని పౌరసరఫరాల అవసరాలకు పచ్చి బియ్యాన్ని వాడుకోవడం జరుగుతుంది. మిగిలిన ధాన్యాన్ని పచ్చి బియ్యం చేయటానికి వీలుకాని రకాలను బాయిల్డ్ బియ్యంగా మార్చి అప్పగిస్తారు. వారు



ఎఫ్‌సిఐ సంస్థకు అప్పగిస్తారు. కేంద్రం ప్రభుత్వం ఆ బియ్యాన్ని బాయిల్డ్ బియ్యం వాడకం చేసే రాష్ట్రాలకు ప్రాంతాలకు సరఫరా చేస్తుంది. ఈ విధంగా మిల్లింగ్ కోసం అప్పగించిన ధాన్యాన్ని కొందరు మిల్లర్లు సంవత్సరాల తరబడి పౌరసరఫరాల శాఖకు ఇవ్వకుండా తమ వ్యాపార అవసరాలకు వాడుకొని కొందరు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకున్నారు. సివిల్ సప్లై అధికారులకు మాత్రం వాయిదాలు పెడుతూ నెలల తరబడి సంవత్సరాల తరబడి గడుపుతూ వచ్చారు. రైస్ మిల్లు నిర్మాణ వ్యయం కంటే సీఎంఆర్ బకాయిలే అధికంగా ఉన్నాయి. రైస్ మిల్లు నిర్మాణానికి రూ.20 నుండి రూ.30 కోట్లు అవుతుండగా.. సీఎంఆర్ మాత్రం రూ.70 నుండి రూ.80 కోట్లు ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ విషయంపై ఇటీవల కాలంలో విజిలెన్స్ అధికారులకు అనేక ఫిర్యాదులు రావడంతో ఫిర్యాదులు వచ్చిన జిల్లాలలో విచారణ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు ఈ తరహాలో సూర్యాపేట జిల్లాలో భారీగా బకాయిలు ఉన్న మిల్లులపై సిబిఐకి ఫిర్యాదులు వెళ్లడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిల్లర్లలో కలకలం రేపింది సిబిఐ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో అని భయాందోళనకు గురవుతున్నారు.

కొత్త అవతారం ఎత్తుతున్న అవినీతి మిల్లర్లు..

జిల్లాలో భారీగా సీఎంఆర్ బియ్యంలను అధికారులు సీజ్ చేయటం నోటీసులు ఇవ్వడం కేసులు పెట్టడంతో పాటు బకాయిలు పడిన మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయకుండా బ్లాక్ లిస్టులో పెట్టారు. కానీ వ్యాపారులు మాత్రం తిరిగి బినామీ పేర్లతో కొత్త మిల్లులను ఏర్పాటు చేసుకొని తిరిగి ధాన్యం కేటాయింపులు కూడా చేయించుకున్నట్లు తెలిసింది. కొత్త మిల్లులు కట్టుకొని వ్యాపారాలు చేసుకుంటూ ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బకాయిలపై మాత్రం కోర్టుల్లో వాయిదాలు వేయించుకుంటూ తమ వ్యాపార లావాదేవీలు చేసుకుంటున్నట్లు తెలిసింది. కోర్టుల్లో తీర్పులు కూడా వెలువడటానికి సంవత్సరాల కాలం పడుతుండటంతో అవినీతికి పాల్పడుతున్న రైస్ మిల్లర్లకు భయం లేకుండా పోయింది. మిల్లర్లు ఈ విధంగా కొత్త అవతారాలు ఎత్తి తమ వ్యాపారాలు నిర్వహించుకోవడం జిల్లా అంత చర్చనీయాంశంగా మారింది దీనిపై సిబిఐ అధికారులు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏ విధమైనటువంటి చర్యలు తీసుకోనున్నారో వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా అధికారుల సహకారం లేకపోయినట్లయితే సీఎం ఆర్ బకాయిలు జిల్లాలో పెద్ద మొత్తంలో వందల కోట్లల్లో ఉండవనేటటువంటిది కొంతమంది మిల్లర్ల వాదన. కొంతమంది మిల్లర్లు చేసే తప్పుడు పద్ధతుల వల్ల జిల్లాలో ఉన్నటువంటి రైసు మిల్లర్ల వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందని నిజాయితీగా సీఎం ఆర్ పెట్టిన మిల్లర్లు అంటున్నారు. ఈ అవినీతి మిల్లర్ల పై ప్రభుత్వం ఏ విధమైనటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే ఎటువంటి అవకతవకరం లేకుండా ఏ సీజన్ కచ్చితంగా సీఎంఆర్ ధాన్యం వసూలు చేసినట్లయితే అక్రమాలకు చోటు ఉండే అవకాశం ఉండదు. పెద్ద ఎత్తున ప్రభుత్వానికి నష్టం వచ్చే పరిస్థితులు కూడా ఉండవు. ఎప్పటికైనా సివిల్ సప్లై అధికారులు గతంలో జరిగిన పొరపాటున సరిదిద్దుకొని సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు వసూలు చేయడం పట్ల నిర్దిష్టమైనటువంటి విధానాలు రూపొందించుకొని అమలు చేయాలని మిల్లర్లు కోరుతున్నారు.

జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు అయితబోయిన రాంబాబుగౌడ్, కార్యదర్శి బుక్క రాంబాబులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం నందు అదనపు కలెక్టర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు సరైన న్యాయం జరుగుతుందని భావించినప్పటికీ కెసిఆర్ ప్రభుత్వంలో ఎలాంటి న్యాయం జరగలేదని అలాగే ఈ ప్రభుత్వం లోనైనా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. జర్నలిస్టుల పైన రాష్ట్రంలో అనేక దాడులు జరుగుతున్నాయని జర్నలిస్టుల పై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఇళ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వమే రివ్యూ పిటిషన్ వేసి వాదనలు వినిపించి అనుకూలమైన తీర్పు వచ్చే విధంగా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. . మహిళా వర్కింగ్ జర్నలిస్టులకు భద్రతతో కూడిన సౌకర్యం కల్పించాలని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్వాయి జానయ్య,నాయిని శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల సైదులు గౌడ్,ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్షులు లింగాల సాయి,కార్యదర్శి నందిపాటి సైదులు, కోశాధికారి వేల్పుల ప్రవీణ్, రూథర్ బిక్షం, కృష్ణమూర్తి, పరమేష్, పుట్ట రాంబాబు, గూడపూరి ప్రభాకర్, షేక్ ఆసిఫ్, వల్దాస్ శంకర్, భాస్కర్, సురేష్, కంచర్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సన్న రకం ధాన్యానికి వెంటనే బోనస్ చెల్లించాలి

- బీఆర్ఎస్ ధర్నా

నవతెలంగాణ-తుంగతుర్తి



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ హామీ నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా సోమవారం మండల పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య ఆధ్వర్యంలో రైతులు పార్టీ కార్యకర్తలు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు బోనస్ కింద ఇంకా 90 శాతం కు పైగా చెల్లించాలని,బోనస్ పేరిట బోగస్ మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. గత 14 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని అన్నారు. రైతు భరోసా రైతు రుణమాఫీ పూర్తి చేయలేదని యాసంగి పంటకు చివరిదాకా నీరు అందించలేక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మిన రైతులు నాట్లు పెట్టి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి ఓట్లు వేస్తే తమ జీవితాలు ఇలా అవుతాయని ఊహించలేదని పశ్చాత్తాపముతో ఉన్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాములు గౌడ్ తుంగతుర్తి మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, నరేష్, నాగయ్య, మట్టపల్లి వెంకట్, గోపగాని శ్రీనివాస్ మండల పరిధిలోని వివిధ గ్రామాల కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరి వెంకట్ నారాయణ

నవతెలంగాణ-కోదాడటౌన్



రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరి వెంకట్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కోదాడ పట్టణం సీఐటీయూ కార్యాలయంలో టైలరింగ్ వర్కర్స్ యూనియన్ నూతన వేతన ఒప్పందంపై సమావేశం జరిగింది. అనంతరం టైలరింగ్ యాజమాన్యంతో కార్మిక సంఘ నాయకులు చర్చలు జరిపి అనంతరం పెరిగిన రేట్ల వేతన ఒప్పంద పత్రాన్ని యాజమాన్యానికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలలో పనిచేస్తున్న సంఘటిత అసంఘటిత రంగ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని దేశంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కార్మికులుఅనేక ఉద్యమాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఆ చట్టాలను రద్దు చేసేంతవరకు కార్మికుల పోరాటాలు ఆగవని వారన్నారు. దేశంలో రెడీమేడ్ వ్యవస్థ వచ్చిన తర్వాత టైలరింగ్ కార్మికుల వ్యవస్థ దీనస్థితికి వచ్చిందని కుట్టు వింషన్ల మూలనపడేసి పట్టణ కేంద్రాలకు వలసలు వెళున్నారని, అలాంటి కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలం చెందారని వారన్నారు. పల్లెల్లో పట్టణాలలో టైలరింగ్ వ్యవస్థను నమ్ముకుని బ్రతుకుతున్న కుటుంబాలు నేడు కుమారిల్లి పోతున్నాయని వారన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈరోజు కోదాడ పట్టణంలో టైలరింగ్ కార్మికులు నూతన వేతన ఒప్పంద అగ్రిమెంట్ గతంలో 40 శాతం ఉంటే దానిపై 50 శాతం తెచ్చుకోవడం జరిగిందని, ఇలాంటి పేద బడుగు బలహీన వర్గాల కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించి ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం ముత్యాలు. యాజమాన్యం షేక్ చాంద్ పాషా, సూర్యం, నాగ చారి, పురుషోత్తం, యూనియన్ అధ్యక్షులు షేక్ జానీ కార్యదర్శి ఎం నాగయ్య. షేక్ కాజా షేక్ పాషా మస్తాన్ వీరారెడ్డి పుల్లాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి

నవతెలంగాణ-తిరుమలగిరి



ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య డిమాండ్ చేశారు.. సోమవారం తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో ప్రజా సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్న ఇప్పటివరకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఆరువేల రూపాయలు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు వీటన్నిటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ చిత్తలూరి సోమయ్య, పొన్నం సోమయ్య, పల్లె కొమురయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

అలరించిన పాటల పోటీలు

నవతెలంగాణ-హుజూర్‌నగర్



స్పందన నాట్య కళామండలి అధ్వర్యంలో మహా శివరాత్రి పండగ సంధర్భంగా గానగంధర్వుడు ఎస్పీ బాల సుబ్రమణ్యం జ్ఞాపకార్థం స్తానిక ప్రజాభవన్ లో నిర్వహించిన పాటలపోటీలు ఆహుతులను అలరించాయి. ఈ పోటీలలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి కళాకారులు గాయకులు పాల్గొని తమ ప్రావీణ్యాన్ని చాటారు. నిర్వాహకులు స్పందన నాట్య కళామండలి అద్యక్షులు కొట్టు లక్ష్మీనారాయణ బాబు మాట్లాడుతూ.. పాటల పోటీలలో గాయకులు 90 మంది పాల్గొన్నారని ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి కె ఎమ్ నాయుడు(వైజాగ్) రూ.10000, రెండవ బహుమతి జి రాజ్ కుమార్ (చిలకలూరిపేట) రూ.8000 మూడవ బహుమతి రాజు (తణుకు) రూ.6000 నాల్గవ బహుమతి చేబ్రోలు శ్రీనివాసచారీ (నాగర్జున సాగర్) రూ.4000 ఎమ్ మాధవీ (విజయవాడ) ఐదవ బహుమతి రూ.2000, 5 గురికి జ్యూరీ, 10 మందికి కన్సోలేషన్ తోపాటు 12 ప్రత్యేక బహుమతులు విజేతలకు అందజేసినట్లు కొట్టు బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన నాట్య కళామండలి గౌరవ అధ్యక్షులు గొట్టె రామయ్య, మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, పెద్దిరెడ్డి గణేష్, కీత మల్లికార్జున్, కళాకారుడు పుల్లయ్య, వేంకటేశ్వర్లు, ములకలపల్లి సీతయ్య, చిమట సైదులు, రౌత్ వేంకటేశ్వర్లు, కోలశ్రీను, లింగయ్య, నలమాధ శ్రీనివాస్, యరగాని గోపాలం కళాకారులు కళాభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- డిస్ట్రిక్ట్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ జడ్జ్ శ్రీవాణి

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్



విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడి చదవాలని అప్పుడే ఓ మంచి సమాజం ఏర్పడుతుందని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ జడ్జ్ పి.శ్రీవాణి ఉద్బోధించారు. మండలం కేంద్రంలోని జ్యోతిబాపూలే బాలుర బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన శిబిరంలో జడ్జ్ పి. శ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకం, రవాణా , ఫోక్సో వంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్నందున పిల్లలు చెడు స్నేహాలకు చెడు అలవాట్లకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో అవసరం ఉన్నవారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రజలకు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో రాజీ పడదగిన కేసులను రాజీ చేసుకుని శాంతియుత జీవనాన్ని కొనసాగించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. విద్యార్థులు ఆటలోను చదువుల్లోనూ ముందుండి తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలని, మంచి భవిష్యత్తును అందుకునేందుకు నిత్యం కృషి చేయాలని హితవు పలికారు. మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.కె. మిల్కీ జహాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ పూర్వ సభ్యులు ఏడిండ్ల అశోక్ , బార్ అసోసియేషన్ కోశాధికారి డి వీరేష్ నాయక్, జిల్లా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకట్ రత్నం, జిల్లా కోర్టు అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వాణి పెండెం, ఏ.ఎస్.ఐ దస్తగిరి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సిబ్బంది కీత పద్మజ, భాషా నాయక్ ముని, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులను దుర్భాషలాడిన లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేయాలి

- ప్రముఖ పారిశ్రామికవేత్త ఇమ్మడి సోమ నరసయ్య

నవతెలంగాణ-సూర్యాపేట



ఆర్యవైశ్యులను దుర్భాషలాడిన ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేయాలని ప్రముఖ పారిశ్రామికవేత్త ఇమ్మడి సోమ నరసయ్య డిమాండ్ చేశారు.జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షులు మీలా వంశీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆర్యవైశ్య ప్రముఖులతో కలిసి పట్టణ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులుకు ఫిర్యాదు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుడై ఉండి బాధ్యతాయుతమైన పదవిలో కొనసాగుతూ ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆర్యవైశ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దుర్భా షలాడడం తగదన్నారు. ఆర్యవైశ్యులు ముసలివారు, వెదవలు అ సోషల్ మీడియాలో ఆయన సంభోదించడం సరి కాదన్నారు. ఆర్యవైశ్యుడై ఉండి ఆర్యవైశ్యులను కించ పరచడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. 11 ఏళ్ల ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవిలో ఉన్న అమరవాది లక్ష్మీనారాయణ ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలన్నారు. ఆర్యవైశ్యులకు సమస్యలు వస్తే రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన స్పందించకపోతే ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు మీలా వంశీ మాట్లాడుతూ ఈసారి ఎన్నికల ప్రచారంలో ఆర్యవైశ్యులను దుర్భాషలాడడం దారుణమని ఆయనపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీనారాయణ వ్యాఖ్యలను ఆర్యవైశ్యులమంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు గుండా శ్రీధర్, చింత వెంకన్న, యామ సంతోష్, మహంకాళి శివ, తల్లాడ కృష్ణమూర్తి, మాద్గుల శంకర్, కొత్త వెంకటేశ్వర్లు, కర్నాటి వంశీ, కొత్త వెంకన్న, వంగవీటి రమేష్, దేవరశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి రూ.50,116 విరాళం అందజేత

నవతెలంగాణ-నూతనకల్



మండల పరిధిలోని వెంకేపల్లి గ్రామనికి చెందిన సీతారామాంజనేయ స్వామి, శ్రీరామలింగేశ్వర స్వామి వార్ల దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ తీగల గిరిధర్ రెడ్డి దేవాలయానికి రూ.50,116 సోమవారం విరాళంగా అందజేశారు. సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మెన్ చిర్ర విజయ్ కుమార్ ,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోనుకునూరి సైదులు గౌడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బస్సుల అశోక్ యాదవ్ మండల నాయకులు మూడ్ మోహన్ నాయక్, దేవాలయ కమిటి సభ్యులు, గ్రామస్తులు ఇమ్మడి జయకుమార్, సైరెడ్డి శంభా రెడ్డి, ఇమ్మడి విజయ్ కుమార్, తీగల ప్రీతం రెడ్డి, పేర్ల గంగరాజు, పాశం శ్రీనివాస్ రెడ్డి దేశగాని మల్లయ్య, పాల్వాయి పరుశరాములు, మారోజు సదానంద చారి, పాలవరపు కృష్ణమూర్తి, చిలువేరు శివ, తీపిరెడ్డి లింగారెడీ మాజీ ఎంపీటీసీలు బండపల్లి సాగర్ గౌడ్, నకిరెకంటి వెంకన్న, అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్ మరికంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'మన ఇసుక మన వాహనం'ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

మండలంలోని మన ఇసుక మన వాహనంను తాటిపాముల ,నందాపురం రిచ్ లను ఉపయోగించుకోవాలని తహసిల్దార్ బి.హరి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.సాండ్ టాక్సీ లో బుక్ చేయని ట్రాక్టర్ లు ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకోబడునని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

నవతెలంగాణ-మునగాల



ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల మందులు అందుబాటులో వుండే విధంగా చూడాలన్నారు. రోగులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చికిత్సలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది సమ యాపాలన పాటించాలన్నారు. మెడిసిన్ స్టాక్ రిజిస్టర్ రికార్డులను పరిశీలించారు. పేషెంట్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దారు వలిగొండ ఆంజనేయులు, వైద్య సిబ్బంది వున్నారు.

కుంభమేళాలో గాయపడిన వ్యక్తులకు పరామర్శ

నవతెలంగాణ-మోటకొండూరు

మండలంలోని చాడ గ్రామానికి చెందిన పలువురు కుంభ మేళాకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గాయాలపాలై హైదారాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారిని సోమవారం టెస్కాబ్ వైస్ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు.

సీపీఐ సీనియర్ కార్యకర్త సీతారాంరెడ్డి మృతి



నవతెలంగాణ-చింతలపాలెం

మండల కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ కార్యకర్త ఉస్తెల సీతారాంరెడ్డి(85) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి పట్ల సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. అనంతరం గన్నా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆనాడు చింతలపాలెం (మల్లారెడ్డిగూడెం)లో జరిగినటువంటి భూపోరాటంలో తన అన్న వీరారెడ్డి తో పాటు భూ పోరాటంలో పాల్గొన్నారని, పార్టీకి ఎల్లప్పుడు అండగా నిలిచిన వ్యక్తని అన్నారు. ఆయన మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని అన్నారు. సీతారాంరెడ్డి పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉస్తెల సృజన, నారాయణరెడ్డి, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, చింతిరాల రవి, అబ్దుల్ బాషా, జియాలుద్దీన్, సుధాకర్ రెడ్డి, భార్య అనసూర్యమ్మ, వెంకటరెడ్డి, చిన్న కొండారెడ్డి, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్‌ఆర్ట్స్‌లో ఎస్వీ స్కూల్ విద్యార్థినికి గోల్డ్ మెడల్

నవతెలంగాణ-కోదాడటౌన్



ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్‌లో ఎస్వీ హైస్కూల్ విద్యార్థిని కోదాడ పట్టణంలోని స్థానిక ఎస్వీ హై స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న సిరికొండ శేషశ్రీ అండర్ 14 క్యాటగిరి కటా విభాగం, కుమిటేలలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. శనివారం హైదరాబాదులోని ఎల్బీనగర్ సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన శేషశ్రీ ని పాఠశాల ప్రిన్సిపల్ వల్లి పద్మ అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటుగా భవిష్యత్తులో తమను తాము రక్షించుకునేందుకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చి గోల్డ్ మెడల్ సాధించేలా ప్రోత్సహించిన మాస్టర్ వెంకటేష్ ను ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అభినందించారు.

దేవాలయ అభివృద్ధికి సహకరించడం అభినందనీయం

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్



పిల్లలమర్రి చారిత్రక దేవా లయాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని దేవాలయ కమిటీ చైర్మెన్ గవ్వ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. సూర్యాపేట ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్ పిల్లల మర్రి మహాదేవ నామేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో మారేడు చెట్టు చుట్టూ రూ 40 వేలతో రెయిలింగ్ పనులు చేయించారు. సోమవారం పూర్తయిన పనులను చల్లా లక్ష్మీకాంత్ శృతి దంపతులు పరిశీలించి త్రికూటాలయంలో శివయ్యకు పంచామృతాలతో అభిషేకం చేశారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటి చైర్మెన్ గవ్వ వెంకటకృష్ణారెడ్డి వారిని సన్మానించారు.

నవతెలంగాణ
యాదాద్రి భువనగిరి
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com

వంగపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-మోటకొండూరు

ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి సోషియల్ మొబిలిటీ ఆఫ్ ఫిషింగ్ కమ్యూనిటీ ఏ సోషియాలజికల్ స్టడీ ఆన్ ట్రెడిషనల్ ఫిషరీస్ ఇన్ మహబూబ్ నగర్ డ్రిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ అనే అంశంపై డాక్టరేట్ పొందారు. వారి తల్లి దండ్రులు రాములయ్య లక్ష్మి వ్యవసాయ అధారిత కుటుంబం. వీరి కుమారుడు విద్యాభ్యాసం పూర్తి చేసి వివిధ రాష్ట్రాల్లో వృత్తి పరమైన అంశాలపై పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు సంస్థకు యూనివర్శిటీ అధ్యాపక బృందానికి మిత్రులకు, శ్రేయోభిలాషులకు వంగపల్లి శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నేటి నుండి మద్యం షాపులు మూసివేత

నవతెలంగాణ-భువనగిరి

ఈనెల 27న జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ భువనగిరి జోన్ పరిధిలో 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి 27వ తారీకు సాయంత్రం నాలుగు గంటల వరకు మద్యం షాపులు, రెస్టారెంట్లు, హోటల్లు, క్లబ్బులు మరియు ఇతర అన్ని రకాల మద్యం అమ్మకాలను నిలిపివేస్తూ తెలంగాణ ఎక్సైజ్ చట్టం-1968, సెక్షన్ 20, ప్రకారం కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. డ్రై డే ఆదేశాలు అమలులో ఉన్న ఈ రెండు రోజులలో సాధారణ మద్యం షాపులతోపాటు ఇతర రకాల మద్యం అమ్మకాలకు లైసెన్సులు పొందిన వారు ఎటువంటి అమ్మకాలు లేదా సర్వ్ చేయడం జరపకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. నిబంధనలను అతిక్రమించి మద్యం అమ్మకాలు జరిపే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉండడం వల్ల ఎటువంటి మద్యం అమ్మకాలూ జరగకుండా అధికారులు మరియు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఎండుతున్న ఆశలు.. !

- అడుగంటిపోతున్న భూగర్భజలాలు
- ఆగిఆగి పోస్తున్న బోర్లు
- ఎండిపోతున్న వరిచేలు

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

ఓ వైపు వేసవి ఎండల తీవ్రత.. మరో వైపు అడుగంటుతున్న భూగర్భ జలాలతో రైతులు సాగు చేసిన వరి పంట చేలు ఎండి పోతున్నాయి. ఎట్లాంటి సాగునీటి వనరులు లేని ఈ ప్రాంత రైతులు వర్ష ఆధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. గత మూడు ఏళ్లుగా ఈ ప్రాంతంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువు కుంటల్లోకి చుక్కనీరు చేరలేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. బోర్లు ఆగిపోస్తున్నాయి. ఫలితంగా ఇప్పటికే మండలంలోని నారాయణపురం, వెంకంబాయితండ, తుంబాయితండ, రాచకొండ, కడీలబాయితండ, సర్వేలు, చిమీర్యాల, మహ్మదాబాద్, పుట్టపాక, వాయిల్లపాల్లి, జనగాం, గుజ్జా తదితర గ్రామాల్లో వరి చేలు ఎండి పోతున్నాయి. మండలంలో సుమారుగా 1800 ఎకరాల్లో వరి సాగు చేయగా వేసవి ఆరంభంలోనే 50 శాతం వరి చేలు ఎండి పోయాయి. అరక ఎద్దులకు తాగు సాగునీరు దొరకని పరిస్థితి నెలకొంది. పశువుల తాగు నీళ్ళను ఇంటి దగ్గర నుంచి నెత్తి మీద మూసుకెళ్తున్నారు. ఇబ్బందులు భరించలేక అరక ఎద్దులను అడ్డికి పావు శేరు చొప్పున సంతల్లో అమ్ముతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా లో 17 మండలాలు ఉండగా నారాయణపురం మండలంలోనే అత్యధికంగా 22.09 మీటర్లకు నీటిమట్టం పడిపోయింది. జనవరి నెలలో భూగర్భ జల అధికారులు 51 గ్రామాల్లో నీటి మట్టాలను పరిశీలించగా కేవలం ఆరు గ్రామాల్లోనే నీటిమట్టాలు గతం కంటే మెరుగ్గా ఉన్నాయని మిగిలిన 45 గ్రామాల్లో తగ్గు ముఖం పట్టాయని నిర్ధారించారు. రాబోయే రెండో నెలల్లో తీవ్రస్థాయిలో నీటిమట్టలు పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. నారాయణపురం మండలంలో గత సంవత్సరం 10.61 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలాలుఈ ఏడు వేసవి ఆరంభంలోనే 22.09 మీటర్ల లోతుకు వెళ్లాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడు -11.48 మీటర్ల భూగర్భలోకి పడిపోయినట్టు అధికారుల ధృవీకరిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి సాగునీటి వనరు లేకపోవడమే భూగర్భ జలాలు అడుగంటి పోతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు.సాగునీటి వనరులు కల్పించాల్సిన పాలకులు ప్రతి ఎన్నికల్లో హామీలు ఇవ్వడం గెలిచాక మర్చిపోవడం పరిపాటిక మారిందని రైతుల ఆరోపిస్తున్నారు. ఎండిపోయిన వరి చేలను పరిశీలించి ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.





సాగునీటి కల్పన కోసం ప్రతిపాదించబడిన ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి: గాలయ్య(రైతు)



నాకు ఉన్న 2 ఎకరాల్లో వరి నాటు వేసిన రూ.80 వేల ఖర్చు వచ్చింది. నాటు దశలో ఫుల్లుగా పోసిన బోరు బావి నెలలోపే పూర్తిగా ఎండిపోయింది. పశువులకు తాగేందుకు నీళ్లు దొరకడం లేదు. పోయిన ఖరీఫ్ సీజన్లో ఇదే పొలంలో 8 క్వింటాళ్ల వడ్లు పండించిన. ఈ ఏడు యాసంగిలో నాటేసిన వరి నీళ్ల లేక ఎండిపోయింది. ఎండిన వరి చేను పశువుల ను మేపుతున్న ఎండిపోయిన వారికి పెట్టుబడి ఖర్చులైనా ప్రభుత్వం చెల్లించాలి. మా కుటుంబాలను ఆదుకోవాలి.

పశువులకు ఇంటి దగ్గర నుంచి నీళ్లు మోస్తున్న: రేవనపల్లి రాములు (కౌలు రైతు)



నాకున్న 1ఎకరం పొలంతో పాటు మరో 2ఎకరాలు కౌలు కు తీసుకుని వరి సాగు చేసిన ఎండల వల్ల బోరు కొట్టి పోయింది. పశువుల తాగేందుకు నీళ్ల లేవు.ఇంటి దగ్గర నుంచి నెత్తి మోతన బిందెలతో నీళ్ల పశువులకు మోసి పోస్తున్న ఈ ఇబ్బంది పడే దానికంటే పశువులను అమ్మేయాలనుకుంటున్న.ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

తెగుళ్ల బారిన పడి ఎకరం ఎండింది: ఏపూరి సతీష్ (రైతు)



తను మూడు ఎకరాల్లో వరి నాటు వేసిన నెల రోజులు దాటుతున్న తెగుళ్ల బారిన పడిన వరి పంట కోల్పోవడం లేదు. గుళికలు వేసిన పిచికారి చేసిన 1ఎకరం ఎండి పోయింది. మిగిలిన రెండు ఎకరాలు ఎండల తీవ్రత వల్ల భూగర్భ జలాల అడుగంటి పోతుండడంతో పంట చేతికి వచ్చేదాకా ఆశ లేదు. ఎండిపోతదో పండిపోతాదో తెలియని పరిస్థితి ఈ ప్రాంతానికి సాగునీటి వసతి లేకపోవడమే రైతుల కు శాపంగా మారింది. సాగునీటి వనరులు కల్పించేందుకు కృషి చేయాలి.

రిజర్వ్ బ్యాంకు వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో వాక్తాన్ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక విద్య యొక్క ప్రాముఖ్యతను, ఈ సంవత్సరం "ఆర్థిక అక్షరాస్యత - మహిళల శ్రేయస్సు" అనే అంశం మీద ఈ అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. మహిళలను శక్తివంతం చేయడంలో వారి ఆర్థిక శ్రేయస్సును ప్రోత్సహించడంలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్రను పోషిస్తుందని తెలిపారు. మహిళల శ్రేయస్సుపై దృష్టి సారించడం ద్వారా ఆర్థిక నిర్వహణలో మరియు ఆర్థిక వ్యవస్థకు తోడ్పడటంలో మహిళలు కీలక పాత్ర పోషించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి అన్నారు. ఆర్థిక అక్షరాస్యత ద్వారా మహిళలకు సాధికారత కల్పించడం ద్వారా, మనకు, మన కుటుంబాలకు, మన సమాజాలకు ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు అని పీడీ మెప్మా రమేష్ అన్నారు. మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడానికి, అందుబాటులో ఉన్న వివిధ ఆర్థిక వనరులు మరియు బ్యాంకింగ్ సేవల గురించి మహిళలకు అవగాహన కల్పించడం చాలా అవసరం అని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కే శివరామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పిడి రమేష్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కే.శివరామకృష్ణ , శ్రీ ఉపేందర్ రెడ్డి ,అదనపు డిఆర్‌డిఓ శ్రీనివాస్, స్వయం సహాయక సంఘాల ఆర్పీలు, వివో ఏలు,కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది , మహిళలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిని కలిసిన అనిల్ కుమార్

రాష్ట్ర వ్యాప్త ప్రజాసమస్యలపై చర్చ



నవతెలంగాణ-అడ్డగూడూరు

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్ సోమవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నూతన రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీని మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే, శాలువాతో సన్మానించారు. అనంతరం జాన్ వెస్లీ మాట్లాడుతూ తెలంగాణలో రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేయడం కోసం సంసిద్ధం కావాలని తెలిపారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అవుట్సోర్సింగ్ ఉద్యోగాల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికుల సమస్యల గురించి ఖాళీగా రాకేష్ కుమార్ రాష్ట్ర కార్యదర్శికి అనేక సమస్యలు వారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది. అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అనేక ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని కూడా రాష్ట్ర కార్యదర్శి దృష్టికి తీసుకుపోవడం జరిగింది. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న విద్య రంగ సమస్యలను పరిష్కరించాలని ఈ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని కోరారు.

ఫూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ కృషి అభినందనీయం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల ఆశోక్

నవతెలంగాణ-భువనగిరి



జిల్లా కేంద్రంలో సామాజిక విజ్ఞానం అందిస్తున్న ఫూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ కృషి అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో జ్ఞాన సేవలందిస్తున్న ఫూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌కి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానం ఎవరిసొత్తు కాదని నేటి యువత మహనీయుల చరిత్రలను, విజయగాదలను చదివి తెలుసుకొని వారినుండి స్ఫూర్తి పొందాలన్నారు. అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం కృషి చేసిన గౌతమ బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావు ఫూలే, బాబాసాహెబ్ అంబేద్కర్,లెనిన్ వంటి వారి ఆశయాలు, పోరాటాలు తెలుసుకొని సమసమాజం కోసం పనిచేయాలని అన్నారు. భువనగిరిలోని ఫూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ సమన్వయకర్త సురుపంగ శివలింగం కి పుస్తకాలను అందజేసారు.

యువత ఆలోచనలు.. దేశ భవిష్యత్తుకు పునాదులు



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

యువత నూతన ఆలోచనలు దేశ భవిష్యత్తుకు పునాదులను అని యంగ్ ఇండియా యంగ్ లీడర్షిప్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సిహెచ్ రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం భువనగిరి మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో యంగ్ ఇండియా షిప్ కార్యక్రమాన్ని వన్ స్టాప్ సొల్యూషన్ ఫర్ యూత్ ఎన్జీవో ఆర్గనైజేషన్ ఆరవ సమావేశం నిర్వహించారు. లీడ్ టుడే చేంజ్ టుమారో అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సంస్థ, యువత సమయాన్ని వృధా చేయకండి ఆలోచనలతో ముందుకు రండి ప్రతి అవకాశాన్ని నా కోసమే అని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధగాని మహేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ యువతలో ఉన్న ప్రతి వ్యక్తి లో శక్తి ఉంటుంది ఆ శక్తిని వాడినప్పుడు ఫలితం ఉంటుంది. అని పేర్కొన్నారు .గోద సంపత్ కుమార్ మాట్లాడుతూ యూత్ వ్యసనాలతో కాలాన్ని వృధా చేయకండి కాలంతో పోటీపడి విజయాలు సాధించండిఅని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంబోజు మల్లేశం సార్ జాయింట్ సెక్రెటరీ యేంపాల కొండల్ రెడ్డి ట్రెజరీ వెంకట్ రాజు గౌడ్, జాయింట్ డైరెక్టర్ గాజుల వెంకటేష్ గౌడ్, శ్రవణ్ రెడ్డి ,సంపత్ కుమార్ గౌడ్, శ్రవణ్ కుమార్, గ్రామ యువతీ యువకులు పాల్గొన్నారు.

పార్టీకి అందిస్తున్న సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్



చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 12వ వార్డు మాజీ కౌన్సిలర్ తాడూరి శిరీషపరమేశ్ బీఆర్ఎస్ పార్టీకి అందిస్తున్న సేవలు అభినందనీయమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం తంగడపల్లి రోడ్డులో ఉన్న పీబీ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే మున్సిపల్, సంస్థాగత ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్‌పార్టీ నాయకులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించినప్పటి నుండి తాడూరి పరమేశ్ పార్టీలో ఉంటూ ప్రజలకు నిత్యం సేవలు అందిస్తున్నారని ప్రత్యేకంగా అభినందించారు. కష్టపడి పనిచేసిన వారిని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందన్నారు. అనంతరం శిరీషపరమేశ్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షులు గిరికటి నిరంజన్‌గౌడ్, యువజన విభాగం అధ్యక్షులు తొర్పునూరి నర్సింహాగౌడ్, తంగడపల్లి మాజీ సర్పంచ్ ముటుకులోజు దయాకరచారి, చిన్నం బాలరాజు, ఉడుగు మల్లేశ్‌గౌడ్, గుండెబోయిన వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కు అందజేత

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని గొల్నేపల్లికి చెందిన అవుశెట్టి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలు కావడంతో వారికి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ముందస్తుగా మంజూరు అయిన 1లక్ష 50 వేల రూపాయల ఎల్ఓసి చెక్కును సోమవారం స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాశం సత్తిరెడ్డి, గూడూరు శివశాంత్ రెడ్డి, గంగాపురం దైవాధీనం, రాంబాబు, చిన్నంశెట్టి మధు, మైల అంజయ్య, పల్లెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ స్వర్ణగిరి మహాక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-భువనగిరి



యదాద్రి శ్రీ స్వర్ణగిరి మహాక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదవ రోజైన సోమవారం ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యారాధనలు పూర్తి చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీమాన్ మానేపల్లి రామారావు గద్వార తోరణపూజ నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. ఆలయంలోని యాగశాల లో చతుస్థానార్చన మూర్తి కుంభ హెూమములు నిర్వహించారు. అనంతరం ఇష్టి యాగశాలలో సకల శత్రు బాధలు రోగ నివారణకు సకల కార్య జయమును కాంక్షిస్తూ సుదర్శన ఇష్టి హవనమును నిర్వహించారు. పై కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం శ్రీ వారు తిరుచ్చి వాహనం మీద కొలువుదీరి ఆలయ తిరుమాడ వీధులలో విహరించారు. సాయంత్రం శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణ లో శ్రీ వారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ఇటీవల సురేపల్లి గ్రామ వాస్తవ్యులు కొడెం భాస్కర్ గుండెపోటుతో మరణించగా, పచ్చర్ల బోడు తండా వాస్తవ్యులు గుగులోత్ శ్రీను, అకాల మరణం సందర్భంగా బీఆర్ఎస్ భువనగిరి జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ వారి ఆ రెండు కుటుంబ సబ్యులను ఓదార్చి వారికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ కేషవపట్నం రమేష్, బత్క అశోక్, మాజీ సర్పంచ్‌లు రెడ్డి నాయక్ , భగవాన్, కోనూరు ఆంజనేయులు, బొడ్డు మైసయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చందర్ గోలియ, కొండూరు సత్యనారాయణ గౌడ్, కాసుల శంకరయ్య, పెంటయ్య, శశి కుమార్,రామలక్ష్మయ్యా, కంది శంకర్, నరేష్, వెంకటేష్ ,లింగం శివాలాల్ సురేష్ లు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

మండల కేంద్రంలోని ప్రాచీన ఉమామహేశ్వర, కుమర వీధిలోని శ్రీ రామలింగేశ్వర, రాచకొండ లోని స్వయంభు శంభు లింగేశ్వర ఆలయాల్లో సోమవారం మహాశివరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. మొదట అఖండ దీపారాధన, గణపతి పూజ, జెండా పూజలను కమిటీ సభ్యులు గ్రామస్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాలయం అధ్యక్షులు పాలకూర్ల సతీష్ గౌడ్ శ్యామల,గౌర అధ్యక్షులు వీరమల్ల కేశవులు గుప్తా వెంకట నరసమ్మ పాలకూర్ల యాదయ్య గౌడ్ బాలమణి పాలకూర్ల గిరి గౌడ్, సురపల్లి జోహార్ పట్నం రాములు గౌడ్ సోమనబోయిన కృష్ణ కుమార్ యాదవ్ జనార్దన్ రెడ్డి రాజయ్య శ్రీశైలం వెంకటేష్ లింగస్వామి గౌడ్, చిలువేరు జంగయ్య చిల్లేరు సాయిబాబా, చిలువేరు బిక్షం చెల్లి వేరు వేంకలు, ముత్యాలు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణాన్ని తొలగించాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-మోటకొండూరు

మాటూరు గ్రామంలో అనుమతులు లేకుండా ప్రధాన రహదారి దుర్గమ్మ దేవాలయం ఎదురుగా చర్చి నిర్మాణం చేపడుతున్నందున చర్చిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగ దివ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు ఎల్లంల శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు పీసరి తిరుమల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్ర శేఖర్ రెడ్డి చిర్ర రవీందర్ భూమండ్ల సతీష్ పాల్గొన్నారు

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



నవతెలంగాణ-తుర్కపల్లి

విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోర్టు కేసు రిజిస్టర్‌ని సక్రమంగా నిర్వహించలేదని డిప్యూటీ తహసీల్దార్ కల్పనకు మెమో జారీ చేశారు. అనంతరం తహసిల్దార్ దేశ నాయక్‌తో రివ్యూ నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తప్పవని అన్నారు. కార్యాలయంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల సర్వేయర్ వద్ద సర్వే కోసం ఉన్న అప్లికేషన్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కుల ధ్రువీకరణ సేవలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ వంటి సేవలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అనంతరం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట పదార్థాలను పరిశీలించి పాఠశాల విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజు ఏజెన్సీ నిర్వాహకులు మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పదవ తరగతి విద్యార్థులకు రాబోవు పరీక్షలపై పలు సూచనలు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం మాదాపూర్ గ్రామంలోని పల్లె దావాఖానాలో రికార్డులను పరిశీలించి ఆసుపత్రికి వచ్చిన మహిళలతో ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ జరుగుతున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ప్రైవేట్ హాస్పిటల్ లోకి వెళ్లి డబ్బులు వృధా చేసుకోకుండా ప్రభుత్వ వైద్యశాలలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించండి

- టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య

నవతెలంగాణ-చౌటుప్పల్



ఈ నెల 27న జరిగే నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్‌యుటీఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సోమవారం చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని చందన పాఠశాలలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలన్నా, ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావాలన్నా, ఉపాధ్యాయ, అధ్యాపకుల ఆత్మగౌరవం పెంపొందాలన్నా అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సంబంధిత బిల్లులన్నీ క్లియర్ చేయాలని, కేజీబీవీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని, మినిమమ్ టైమ్ స్కేల్‌ను అమలుచేయాలని, గురుకుల, మోడల్, కేజీబీవీ ఉపాధ్యాయులకు 010 కింద వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డు మంజూరుచేయాలని, ఐదురకాల గురుకుల పాఠశాలల పనివేళలను శాస్త్రీయబద్ధంగా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసిన అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ప్రశ్నించే గొంతుక శాసనమండలిలో ఉంటే ఉపాధ్యాయులకే వన్నె తెచ్చే విధంగా ఉంటుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కొసనం మమత మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగంలోని అన్ని వ్యవస్థల అభివృద్ధి కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పనిచేసే వ్యక్తి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరారు. మైనార్టీ గురుకుల పాఠశాలల రాష్ట్ర ఉపాధ్యక్షులు భరత్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల పక్షాన పోరాడే ఏకైక వ్యక్తి నర్సిరెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల గెలుపుగా భావిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో యుటీఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శులు దోనూరి బుచ్చిరెడ్డి, అవ్వారు గోవర్ధన్, కుకుడాల గోవర్ధన్, టీఎస్‌యుటీఎఫ్ చౌటుప్పల్ మండల అధ్యక్షులు కంబాలపల్లి శ్రీను, రిటైర్డ్ ఉపాధ్యాయులు అందోజు నాగభూషణచారి పాల్గొన్నారు.

పోలింగ్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-బీబీనగర్

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకోసం బీబీనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు, సందర్భంగా ఆయన అధికారులకు పలుసూచనలు, సలహాలు తెలియపరిచారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు, నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసిల్దార్ శ్రీధర్ ,ఆర్ ఐ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పద్మశాలి సంఘం మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

పద్మశాలీల హక్కుల కోసం, చేనేత కార్మికుల సమస్యల కోసం 17వ అఖిలభారత పద్మశాలి మహాసభ, ఎనిమిదవ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలని, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మర్తపు మురళి అన్నారు. మండల కేంద్రంలోని కమలమ్మ జనార్ధన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పద్మశాలీల సన్నాహాక సమావేశంలో ఆయన సోమవారం పాల్గొని మాట్లాడారు. రాజకీయరంగంలో పద్మశాలీలు రాణించాలని పిలుపునిచ్చారు. మార్చి 9న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే తెలంగాణ పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పద్మశాలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిక్క వెంకటేశ్వర్లు.పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం, బింగి వైకుంఠం, ఈడేం శ్రీనివాస్, నగేష్ ఆలేరు పట్టణ పద్మశాలి సంఘం నాయకులు పాశికంటి శ్రీనివాస్, చిక్క శ్రవణ్ కుమార్, బింగి నర్సింహులు, సామల సత్య ఋషి, అంకం రాజు, బడుగు జహంగీర్ చింతకింది ప్రకాష్ , బేతి శ్రీనివాస్, గట్టు రాజు, మెరుగు శ్రీధర్, రచ్చ హన్మంతు, వెంకటాచలం, మార్కండేయ, అనిత,అమృతం నర్సింహులు, మల్లేష్, వెంకటేష్, సిద్దులు తదితర పద్మశాలి సంఘ నాయకులు, చేనేత కార్మిక సంఘ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ఆలేరు టౌన్

పేదరికం నుండి వచ్చి పోలీస్ ఉద్యోగం సాధించి, 2011లో కాకినాడలో ఒకేదగ్గర అందరూ ట్రైనింగ్ పూర్తిచేసి యూసుఫ్ గూడా నందు 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ దోసపాటి బాలరాజ ఇటీవల మరణించగా.. విషయం తెలుసుకున్న సహచర ఉద్యోగులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, తమవంతుగా రూ.1,30,000 సేకరించి బాలరాజు కూతురు శ్రావణి పేరు మీద పోస్ట్ ఆఫీసులో అకౌంట్ తీసి పాస్ బుక్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలరాజు కుటుంబసభ్యులు భావోద్వేగానికిలోనై స్నేహానికి విలువ ఇచ్చి సహాయం చేసినందుకు సహచర ఉద్యోగులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ ప్రసాద్, రామకృష్ణ, స్వామి, మురళీ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వివేకానంద



నవతెలంగాణ-భువనగిరి

జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టి డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి కొలుపుల వివేకానంద విజ్ఞప్తి చేశారు సోమవారం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ వీరారెడ్డికి టీ డబ్ల్యూ జె ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు పొజిషన్ ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు కొత్త ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. నూతన అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని కోరారు. మహిళా జర్నలిస్టులకు రాత్రి వేళలో రవాణా సదుపాయం కల్పించాలన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. జర్నలిస్టుకు వెజ్ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా రిటైర్డ్ అయిన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జేఎఫ్ అధ్యక్షులు పెరబోయిన నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల జలంధర్, జర్నలిస్టులు సామల సిద్దులు, ఎస్కే షరీఫ్, ఆరే నరసింహ, విద్యార్థి సంఘ నాయకులు ఇటుకల దేవేందర్, రాజు, శివ, సాయిబాబు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- నల్గొండ రీజియన్ పరిధిలో 136 ఈ బస్సులు
- సిబ్బంది కార్మికులకు ఆరోగ్య పరీక్షలు
- ఆర్టీసీ నల్గొండ రీజియన్ మేనేజర్ జానీ రెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ సంస్థ లక్ష్యమని నల్గొండ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపో పరిధిలో పవర్ డ్రైవర్ కండక్టర్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన హాజరై ప్రయాణికులతో ఎలా మెలగాలి.. తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆర్ ఎం జానీరెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆర్టీసీ సంస్థను అభివృద్ధి దిశలో ముందు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నా మన్నారు. త్వరలోనే నల్గొండ రీజన్ పరిధిలో 136 ఈ బస్సులు (ఎలక్ట్రికల్) బస్సులు నడుస్తాయని తెలిపారు. నల్గొండ జిల్లాకు 72 ఈ బస్సులు సూర్యాపేట జిల్లాకు 64 'ఈ బస్సులు' మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. నల్గొండ, సూర్యాపేటలో ఆర్టీసీ పరిధిలోని ఎలక్ట్రికల్ బస్సు ఛార్జింగ్ స్టేషన్లో ప్రారంభించిన వెంటనే నల్గొండ, సూర్యాపేట జిల్లా కేంద్రల నుంచి వివిధ ప్రాంతాలకు ఈ బస్సులు నడపనున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆర్టీసీ సిబ్బంది కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 13 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నామని ఆయన వివరించారు. డ్రైవర్ కండక్టర్లకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి ఆరోగ్యం సంబంధించిన రిపోర్టు తెలుసుకొని మెడిసిన్ అందజేస్తారని ఆయన తెలిపారు. నల్గొండ రీజియన్ పరిధిలో ఏడి డిపోలలో 1750 మంది డ్రైవర్ కండక్టర్లు గ్యారేజ్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కోదాడ ఆర్టీసీ డిపో నుంచి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మట్టంపల్లి తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని అదేవిధంగా మిర్యాల డిపో నుంచి వాడపల్లి క్షేత్రశాల సోమప్ప దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ డిపో మేనేజర్ రామ్మోహన్ రెడ్డి, సీఐ భారతి బాయి పాల్గొన్నారు.

చెరువుగట్టులో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి దేవ స్థానాన్ని సోమవారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాంప్రదాయ స్వాగతం పలికి ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు . ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్యా,జిల్లా నాయకులు సాగర్ రెడ్డి, సట్టు సత్తయ్య ., భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ దూది మెట్ల స్రవంతి, ఆలయ అర్చకులు ,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యునిగా వీరన్ననాయక్



నవతెలంగాణ-దామరచర్ల

ఈనెల 19, 20 తేదీలలో జరిగిన ఎస్ ఎఫ్ ఐ జిల్లా మహాసభల్లో జిల్లా కమిటీ సభ్యుని గా దామరచర్ల మండలానికి చెందిన దిరావత్ వీరన్న నాయక్ ను ఎన్నుకున్నారు. విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ మారుమూల గ్రామం నుండి వచ్చి మండల కార్యదర్శిగా, డివిజన్ ఉపాధ్యక్షుడిగా, అనేక విద్యా రంగ సమస్యలపై సమరసిలి పోరాటాలు తాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ తనమీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం సంతోషకరమని అన్నారు .విద్యా రంగ సమస్యల పరిష్కారం కొరకు మరిన్ని ఉద్యమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

యూజీసీ నెట్ సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో లింగరాజు మహేష్ కుమార్, చిరుమర్తి కే అనిల్ కుమార్ నలుగురు విద్యార్థులు యూజీసీ నెట్ సాధించారు. పృథ్వీ నవ్య మల్లేష్ రమ్య వీరు పిహెచ్డి లో ప్రవేశం పొందడానికి అర్హత సాధించారు. వీరందరిని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ రిజిస్టర్ ఆచార్య అల్వాల రవి ఆర్స్ కళాశాల ప్రిన్సిపాల్ తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ఆనంద్ నరసింహ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి అనిత కుమార్‌లు అభినందించడం జరిగింది.

పని ఫుల్... జీతం సగం

- అప్ గ్రేడ్ అంగన్వాడీ టీచర్లకు పది నెలలుగా సగం జీతం
- ఒంటరిగానే 15 రకాల పనులు
- కేంద్రాల నిర్వహణ కష్టంగా ఉంది
- అంగన్వాడి టీచర్ల ఆవేదన

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

జన్మనిస్తూ ఏ తల్లి మరణించకూడదు జన్మించిన ప్రతిబిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, మహిళల్లో చైతన్యం పెంచాలని, మాత , శిశు సంరక్షణ కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం మూడు నుంచి ఐదు సంవత్సరాల చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడం లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేంద్రాలు ఇలా

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 35,700 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా. పరిశీలిస్తే నల్లగొండ జిల్లాలో మొత్తం2093 అంగన్వాడీ కేంద్రాలు.ఉన్నాయి అందులో 262 మినీ అంగన్వాడి కేంద్రాలను. ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మార్చారు. సూర్యాపేట జిల్లాలో. మొత్తం 1,209 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1,126 మెయిన్ కేంద్రాలు ఉండగా 83 మినీ కేంద్రాలు ఉన్నాయి.83 మినీ కేంద్రాల అప్‌గ్రేడ్ కోసం చర్యలు చేపట్టారు. అప్‌గ్రేడ్ అయిన కేంద్రాల్లో సౌకర్యాలు పెంచారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో.901 ఉండగా 57 కేంద్రాలు మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ గా అప్ గ్రేడ్ చేశారు.



అప్ గ్రేడ్ అంగన్వాడీ టీచర్లకు పది నెలలుగా సగం జీతం

మినీ అంగన్ వాడి టీచర్ల పోరాట ఫలితంగా మాతా శిశు సంరక్షణ, కిశోర బాలికల ఆరోగ్యం పట్ల, గర్భిణీ బాలింతలకు, చిన్నారులకు సంపూర్ణ ఆహారం అందించడం ప్రధాన అంగన్వాడి లతో పాటు మినీ అంగన్వాడీ టీచర్లు పని చేస్తున్నారని రాష్ట్రంలో గత ఏడాది కొలువైన ప్రభుత్వం మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా మినీ అంగన్వాడీ టీచర్లకు నెలకురూ 7800 ఇచ్చారు. ప్రధానమైన అంగన్ వాడి టీచర్లకు రూ 13650 జీతం చెల్లిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన అంగన్వాడి టీచర్లతో సమానంగా మినీ అంగన్వాడి టీచర్లకు సైతం మొదటి మూడు నెలలు రూ 13,800 చెల్లించారు. పది నెలలుగా తిరిగి రూ 7800 పాత జీవితంతోనే సరిపెడుతున్నారు.

ఒంటరిగానే 15 రకాల పనులు..

ప్రభుత్వం మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నాటి నుంచి అంగన్వాడి కేంద్రాలను రెండు పూటలా సమయపాలన పాటించడం గర్భిణులు, బాలింతలకు చిన్నారులకు సంపూర్ణ ఆహారం అందించడం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను బోధించడం, రెండు సంవత్సరాల లోపు చిన్నారులకు బరువులు తుగడం, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, వికలాంగులు, ఆరోగ్యం పట్ల సలహా సూచనలు చేయడంతో పాటువైద్యశాఖ ఎన్‌డిడి కార్యక్రమాలకు సహకారం అందించడం.ఫోన్లో యాప్‌ల ద్వారా సమాచారం అప్లోడ్ చేయడం. నిత్యం ఓటర్ల జాబితా సర్వే నిర్వహించడం నూతన ఓటర్లను చేర్చుకోవడం, ఎన్నికల సమయంలో బిఎల్ఓ గా బాధ్యతలు నిర్వర్తించడం చేస్తున్నారు. ప్రధాన అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడి టీచర్ తో పాటు ఒక సహాయకురాలు మధ్యాహ్న భోజన సిద్ధం చేయడం, కేంద్రంలోని ఏర్పాటుతో చేసుకోవడానికి సహాయకారిగా ఉంటారు. ఇదిలా ఉంటే అప్ గ్రేడ్ అయిన. అంగన్వాడీ కేంద్రాల్లో కేవలం టీచర్ మాత్రమే ఈ 15 రకాల పనులు చేసుకోవాల్సి వస్తుంది.

కేంద్రాల నిర్వహణ కష్టంగా ఉంది..

మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా ఏర్పాటు చేసిన తర్వాత సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా ప్రతి కేంద్రంలో ఒక సహాయకురాలను నియమించడంతోపాటు పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు సౌకర్యాలను మెరుగుపరచవలసి ఉండగా టీచర్లకు శిక్షణ ఇచ్చి సౌకర్యాలుమెరుగుపరచకుండా పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తూ సగం జీవితం పొందడం వల్ల మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు కేంద్ర నిర్వహణ కష్టంగా మారిందని అప్ గ్రేడ్, అంగన్‌వాడి టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం గత పది నెలల జీతంతో పాటు ప్రతినెల అంగన్వాడీ టీచర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.



పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి

నవ తెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు జరుగు 10వ తరగతి పరీక్షలు సన్నద్ధంగా జరిగేందుకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి అధ్యక్షతన జిల్లాలోని చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సమీక్షించి, తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 266 పాఠశాలల నుండి 8,631 మంది విద్యార్థులు హాజరవుతారని, దానికి అనుగుణగన్ 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ,పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు లేకుండా త్రాగునీరు , వైద్య సదుపాయం, కరెంటు సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సరైన సమయంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా ఇన్విజిలేటర్స్ పూర్తి అవగాహనతో వెలిగేలా విద్యార్థుల ముందుటనే ప్రశ్నపత్రాలను తెరిచి వారి యొక్క సంతకాలను సంబంధిత షీట్ లో సేకరించేలా చూడాలన్నారు. పరిష ముగిసిన తర్వాత విద్యార్థులు రాసిన ఆన్సర్ షీట్లు చాలా పగడ్బందీగా ప్యాక్ చేసి సంబంధిత పోస్ట్ ఆఫీసులో సమర్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో కానీ ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే విద్యాశాఖ అధికారి లేదా జిల్లా కలెక్టర్ కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఏసిజిఈ రఘురాం రెడ్డి, డిఈ సి బి సెక్రటరీ పాండు నాయక్, మండల విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మంటలు..



నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని జనంపల్లి గ్రామంలో బొంత శ్రీశైలం వ్యవసాయ క్షేత్రం వద్ద సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో గడ్డి తగలబడడంతో పాటు ఎకరాల కొద్ది మంటలు ఒక్కసారిగా విస్తరించడంతో గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రామన్నపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఫైర్ ఇంజన్‌తో ఘటన స్థలానికి చేరుకొని మంటలు విస్తరించకుండా సిబ్బంది ఆర్పివేయడంతో చుట్టుపక్కల రైతులందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారీ నష్టం జరగకుండా నిలువరించారు. పశు గ్రాసం పూర్తిగా దద్దమైపోయింది.

వరి విత్తనాలు వెదజల్లే సాగు పద్ధతిపై అవగాహన



నవతెలంగాణ-రామన్నపేట

సేవా స్పూర్తి ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కక్కిరేణి గ్రామం నుండి పలువురు రైతులు గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంకు తరలి వెళ్లారు. నేరుగా వరి విత్తనాలను విత్తే పద్ధతిలో వరిసాగు చేసే విధానంపై రైతులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.నరేష్, డా కిరణ్, సేవా స్పూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లడుతూ ప్రస్తుత పరిస్థితులలో వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, తరిగిపోతున్న భూగర్భ నీటి వనరులు, వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ సమస్య, కూలీల కొరత, పెరిగిపోతున్న వ్యవసాయ ఉత్పాదకాల ధరల వల్లన వరి వ్యవసాయము గిట్టుబాటుకాక, వ్యవసాయ ఖర్చును తగ్గించుటకు రైతులకు నేరుగా విత్తనాలను విత్తే వరిసాగు విధానంపై అవగాహన కలిగి ఉండాలని వారు సూచించారు. యంత్రాలను ఉపయోగించి సాగుఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. నాట్ల వరిసాగు ఖర్చు కంటే నేరుగా విత్తే వరిసాగుకు వల్ల హెక్టర్ కు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు తగ్గుతుందని వారు తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ రకాలుగా శాస్త్రీయ పద్ధతిలో అవలంబించే వరి, నిమ్మ, బత్తాయి, కూరగాయలుపై క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలతో కలసి రైతులు పరిశీలించారు. వరి వెదజల్లే పద్ధతిలో ఇతరులకు స్ఫూర్తినిస్తున్న గ్రామ ఆదర్శ రైతు ముక్కముల రవిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కన్నెబోయిన సైదులు, వెంకన్న, బెక్కంటి మహేందర్, వేముల సైదులు, మెట్టు మధు, చిల్ల వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చేసిన గుత్తా అమిత్ రెడ్డి

నవతెలంగాణ-చిట్యాల

మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన పలువురు ఇటీవల మరణించగా వారి కుటుంబాలకు సోమవారం గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి సుమారు 70 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఆర్థిక సహాయం పొందిన వారిలో పాకాల నరేష్ 20వేలు,జనపాల చిన్న ముత్తమ్మ 10వేలు,మర్రి రాములమ్మ 10వేలు, అంతటి చంద్రయ్య పది వేలు, దోటి మల్లమ్మ 10వెలు ,బిస్మిల్లా బి లకు 10వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేటి యాదగిరి ,మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి ,సీనియర్ నాయకులు పల్లపు బుద్ధుడు, పట్ల జనార్ధన్, జనపాల శ్రీను ,బొడ్డు శ్రీను, గురుపాటి లింగయ్య, పాకాల దినేష్, మర్రి రమేష్ ,నడింపల్లి గోపాల్ ,వెలిమినేటి హరిప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యపై పట్టు సాధించాలి



నవతెలంగాణ-ఆలేరు టౌన్

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి విద్యపై పట్టు సాధించాలని ,ఆలేరు తహసిల్దార్ ఎన్ అంజిరెడ్డి అన్నారు. ఆలేరు మండల కేంద్రంలో సోమవారం పద్మావతి గార్డెన్లో విఆర్ కళాశాల విద్యార్థుల ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాల అధిరోహించాలన్నారు. ఎస్‌టిఓ కట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. కవి రచయిత డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పరీక్షలలో చక్కని ఉత్తీర్ణత శాతం సాధించి ఈ ప్రాంతానికి, కళాశాలకు ,తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాలం అయ్యప్ప సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆహ్వానితులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఉప్పలి రాజు, పరశు రాములు, మానస, భాస్కర్, మధు, కమలాకర్, సునంద, ఉపచారి, కృష్ణ,ఇందిర,రమేష్, జ్యోతి, సింధు, నర్మదా, పాల్గొన్నారు.

'చంద్రం జ్ఞాపకాలు మరువలేనివి'

నవతెలంగాణ-భూదాన్ పోచంపల్లి

చంద్రం యాదవ్ జ్ఞాపకాలు మరువలేనివని బీఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి భువనగిరి మాజీ ఏమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం పోచంపల్లి మండల కేంద్రంలో జెవిస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యమ నాయకులు దొడ్డమోని చంద్రం యాదవ్ ప్రథమ వర్ధంతిసభలో వారు మాట్లాడారు. కమ్యూనిస్టు భావజాలాలతో ప్రారంభమై తెలంగాణ ఉద్యమంలోతెలంగాణ కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలోయాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కంచెర్ల రామకృష్ణ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి పార్లమెంట్ ఇన్చార్జి క్యామ మల్లేష్ యాదవ్ మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి ,మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా పార్టీ నాయకులు, మండల పార్టీ నాయకులు గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాలర్ మద్దిలేటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎయిడ్స్ తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేష్, కార్యకర్త భవాని , ఆచార్య అల్వాల రవి మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన భవాని విధిని ఎదిరించి గెలిచిన విజయ గాథ స్ఫూర్తిదాయకమన్నారు. ఎయిడ్స్‌ను చిత్తు చేయడానికి చైతన్యవంతమైన సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. ఎయిడ్స్ పై సమాచారం కోసం1096 ను సంప్రదించాలని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి క్లబ్స్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వక్తృత్వ వ్యాసరచన స్కిట్ పోస్టర్ పాటల పోటీలను నిర్వహించారు. ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్లో పాల్గొన్న భువనగిరి ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని మేఘనను ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ రిజిస్టర్ ఆచార్య అలువాల రవి అభినందించారు. ఈ కార్యక్రమంలో వి సుధాకర్ కళాశాలల ప్రిన్సిపాల్లు మారం వెంకట రమణారెడ్డి, డా. కె , ప్రేమ్ సాగర్ అరుణప్రియ, సుధారాణి, జిల్లాలోని వివిధ కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | www.navatelangana.com


ప్రమాదపుటంచున ఎడమ కాలువ

- సిమెంట్ రైలింగ్ లు ఊడిపోతున్న పట్టించుకోని పరిస్థితి



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో పలుచోట్ల కాలువకు ఇరువైపులా ఉన్న సిమెంట్ రైలింగులు ఊడిపోతున్న పట్టించుకోని పరిస్థితి కనిపిస్తుంది . నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని తిరుమలగిరి సాగర్ మండలం అల్వాల గ్రామం వద్ద కాల్వకు పక్కన ఉన్నటువంటి సిమెంట్ రైలింగ్ లు ఊడిపోయి మట్టి కొట్టుకుపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితిని సరైన సమయంలో గుర్తించి మరమ్మతులు చేపట్టకపోతే ఎడమ కాలువకు గండి పడే అవకాశం ఉంటుంది. ఒకవేళ అదే జరిగితే ఎడమ కాలువ వద్ద గండి పడితే అల్వాల గ్రామం,అల్వాల ఎక్స్ రోడ్ వరకు ఎడమ కాలువ నీళ్ల తో ముంచెత్తే ప్రమాదం వుందని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .గతంలో కూడా నిడమనూరు మండలం వేంపాడు వద్ద ఎడమ కాలువకు గండి పడడంతో వేల ఎకరాల్లో పంటలు మునిగిపోయాయి. చాలా రోజుల వరకు పలు గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి . నాణ్యత లేకుండా నాసిరకమైన పనులు చేయడం వలనే పదేపదే ఈ పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్ట్ అధికారులు వీటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





నెర్రెలు బారుతున్న... పొలాలు

- ఎండుతున్న వరిచేలు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చేసేదేమీలేక గేదెలను మోపుతున్న రైతులు
- ఆందోళనలో అన్నదాతలు

నవతెలంగాణ కోదాడ టౌన్

ఎండిపోతున్న వరి పంటలను కాపాడాలని సూర్యాపేట జిల్లాలోని పెన్ పహాడ్ మండల రైతులు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఎస్ ఆర్ ఎస్ పి కాలువల నుంచి కాళేశ్వరం ప్రాజెక్ట్ గోదావరి నీటిని మండలంలోని చివరి భూముల వరకు సాగుచేసిన వరి పంటలు ఎండిపోకుండా నీటిని అందించి, రైతులను ఆదుకోవాలని మండల పరిధిలోని చిన్న గారెకుంటా తండా, పెద్దగారకుంట, చిన్న సీతారాం తండా, పెద్ద సీతారాం తండా గ్రామాలకు చెందిన రైతులు తమ పొలాల వద్ద ఆందోళన చేపట్టి ధర్నా నిర్వహించారు.వానాకాలం వరి సాగు చేసినప్పుడు నీటిని అందించిన ప్రభుత్వం వేసవికాలం కూడా నీటిని అందిస్తుందని,గత ప్రభుత్వాలు అందించాయాని వరి పంట సాగు చేయడం జరిగిందన్నారు. దీంతో వానాకాలం పండించిన పంటల్లో వచ్చిన డబ్బుల ద్వారా యాసంగి పంటల కోసం బోర్లు, బావులు తవ్వించి అప్పుల పాలై ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం మరొక మూడు రోజుల్లో ఎండిన పంటలకు నీటిని అందించకపోతే తమకు మూకుమ్మడిగా చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా అధికారులకు రాజకీయ నాయకులకు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడంతో..ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దామోదర్ రెడ్డి,టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సమస్యని పట్టించుకొని సాగునీరు అందించాలన్నారు. సాగర్ ఎడమ కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి 9 తండాల గిరిజన రైతులకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు.

పంట పొలాలలో గేదెలను మేపుతున్న రైతు...?

కోదాడ నియోజకవర్గంలోని మునగాల, మోతె, నడిగూడెం, మండలాల్లో కూడా ఇదే పరిస్థితి దాపురించింది. మునగాల మండలం నేల మర్రి గ్రామం. ఎస్సారెస్పీ నీరు రాకపోవడంతో పొలం ఎండిపోతున్న క్రమంలో గేదెలను మేపుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ఇలాంటి పరిస్థితి చాలా ప్రాంతాల్లో ఉంది.. ఇప్పటి కైనా జలవనరుల శాఖ అధికారులు క్షేత్రస్థా యిలో పరిశీలించి ప్రణాళికలు రూపొందించి నీరు ఇవ్వాలని కోరుతున్నారు...

> భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.. ఫలితంగా పంటలు ఎండుతున్నాయి.. దీనికితోడు ఉష్ణోగ్రతలు పెరగడంతో నీళ్లు లేక వరి పంట మడులు నెర్రెలు బారుతు న్నాయి. వరి పొలం ఎండుతుండటంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. తాగు, సాగు నీటి అవసరాలు పెరగడం తో రానున్న కాలంలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు కని పిస్తున్నాయి. వేసవి ప్రారంభం కావడం, పంట సాగుకు తోడు ఇతర అవసరాల కు మరో రెండు నెలలకు పైగానే నీటి అవసరం పడనుంది. సూర్యాపేట జిల్లాలో వరిచేలు ఎండిపోతున్నాయి ఎస్సారెస్పీనీటిని చివరి పొలాల వరకు అందించాలని రైతులు డిమాండ్ చే స్తున్నారు. ఇటీవల కుడకుడ గ్రామానికి చెందిన ఓ రైతు నీటిని విడుదల చేయాలంటూ ఏకంగా పురుగుల మందు డబ్బా పట్టుకుని నిరసన వ్యక్తం చేయడం స్థానికంగా కలకలం రేపింది.

సుమారు 50 వేల ఎకరాలకు..

ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో సుమారు 50. వేల ఎకరాలు ఎండిపోయే ప్రమాదంలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత పెరిగి వరికి అధిక సంఖ్యలో నీరు అవసరం పడుతుంది. ఇప్పటికే సరిపడా రావట్లేదు.చాలా మంది రైతులు ఎస్సారెస్పీ నీరు వస్తుం దనే ఆశతో బోర్లు, బావుల కింద సాగు చేశారు. కానీ రాకపోవడంతో ఏం చేయాలో తెలియని దుస్థితి నెలకొంది. ఒక్కో ఎకరానికి ఇప్పటికే సుమారు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు.

రైతులకు అందుబాటులోకి రాని లిఫ్ట్ ఇరిగేషన్

కోదాడ మండలం రెడ్లకుంట్ల గ్రామంలో...రూ 47.54 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన రెడ్ల కుంట లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రారంభించి నెలలు గడుస్తున్న ఇంకా పనులు పూర్తికాలేదు దీంతో రైతులకు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి రాలేదు. ఈ పథకం ద్వారా రెడ్ల కుంట, నల్లబండ గూడెం, కాపుగల్లు గ్రామాలకు లబ్ధి చేకూరుతుంది. అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో రూ 5.30 కోట్లతో ఉత్తమ్ పద్మావతి శాంతి నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించి నెలలు గరుస్తున్నాయి. దీని ద్వారా 5వేల ఎకరాలకు సాగు నీరు అందించ బడుతుంది. ఈ పథకం ద్వారా శాంతి నగర్, గోండ్రియాల, బొజ్జగుడెం తండా, మొగలాయి కోట, అన్నారం,లక్కారం,తమ్మరబండ పాలెం, చిమిర్యాల, కొత్త గూడెం, నల్లబండ గూడెం గ్రామాలకు లబ్ధి చేకూరుతుందని పాలకులు పేర్కొన్నారు.. ఇవి పూర్తిస్థాయి అందుబాటులోకి వస్తే... చివరి భూములు10వేల ఎకరాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందే అవకాశం ఉంది.

అడుగంటుతున్న భూగర్భజలాలు...

సూర్యాపేట జిల్లాలోనూ నీటి మట్టాలు తగ్గిపో తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సరాసరి 5.38 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. అయితే గతేడాది ఇదే సమయానికి జిల్లాలో సరాసరి నీటిమట్టం 2.92 మీటర్ల లోతులో ఉండగా.. ఈ సారి వేగంగా నీరు అడుగంటింది. జిల్లాలో అత్యధికంగా వరిసాగు చేస్తుండటంతో నీటి వినియోగం భారీగా పెరిగి భూగర్భజలాలు అడుగంటుతుండటంతో చాలావరకు బోర్లు, బావుల్లో నీళ్ల సగానికిపైగా తగ్గాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ప్రధానంగా తిరుమలగిరి, చింతలపాలెంమండలాల్లో అత్యంత లోతులో 16.71 మీటర్లు, 13.08 మీటర్ల లోతులోకి జలాలు పడిపోయా యి. ఈ మండలాల్లో గతేడాది నవంబర్ లోనూ భూగర్భ జలాలు సమృద్ధిగానే ఉన్నాయి. కొంత ఆలస్యంగానైనా మంచి వర్షాలు పడ్డాయి. వాగులు, వంకలు పొంగి రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో తిరుమల గిరిలో నవంబర్ లో 2.19 మీటర్లు, చింతల పాలెంలో 3.20 మీటర్ల లోతులోనే ఉన్నాయి. కానీ రెండు నెలల్లోనే ఒక్కసారిగా అడుగంటిపోవడం గమనార్హం.

పంట ఎండిపోతుంది : రైతు



మాది మునగాల మండలం నేలమర్రి గ్రామం ...నేనుసాగు చేసిన రెండు ఎకరాల వరి పంట ఎండిపోతుంది.. చేసేది లక గేదెలను మేపుతున్నాను. సాగర్ నీరు రాక బావుల్లో నీరు ఇంకిపోయి ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.



నీళ్లులేక ఎండిన వరి పొలాలు

- పశువులను మేపుతున్న రైతులు
- ఎకరాకు రూ. 30 ఖర్చు చేశామని రైతులల ఆవేదన

నవతెలంగాణ-చివ్వెంల

యాసంగిలో సాగు చేస్తున్న వరి పొలాలకు పంట పొట్ట దశలో ఉన్న సమయంలో నీళ్ల లేక ఎండిపోతున్నాయి. జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో బోరుబావుల్లో నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయి. ఎండిన వరి పొలాలను పశువుల మేతకు వదిలి పెడుతున్నారు. వరి సాగు చేయడానికి రైతులు చేసిన అప్పులు ఎలా తీర్చాలని ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఒక ఎకరానికి సుమారు రూ. 30 వేల వరకు ఖర్చు చేస్తే తీరా పంట పొట్టకు వచ్చిన దశలో ఎస్సారెస్పీ కాల్వ నీటి ఆధారంగా పంటలు వేస్తే నీళ్ల రాక, బావులల్లో నీరు ఊరకపోవడంతో, ఉన్న బోర్లు పోయక రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు.

4 ఎకరాలు వరి సాగు చేశాను అంతా ఎండిపోయింది

రైతు బోడపట్ల వెంకన్న ,బండమీది చందుపట్ల



నాకు 5 ఎకరాల భూమి ఉంది. దాంట్లో 4 ఎకరాలు వరి సాగు చేశాను. మిగతా ఎకరం భూమిలో పత్తి వేశాను. వరి పంటను ఎస్సారెస్పీ కాల్వ ఆధారంగా, ఒక బోరు ఉండడంతో సాగు చేశాను. మొన్నటి వరకు పైపుల నిండా పోసిన బోరుమోటరు నీళ్ల లేక నల్లాలో వచ్చే మాదిరిగా ఆగి ఆగి పోస్తుండడం, కాల్వ పూర్తిగా రాకపోవడంతో 4 ఎకరాలు ఎండిపోయింది. సాగు చేయడానికి ఒక లక్ష వరకు ఖర్చు పెట్టాను. ఇప్పుడు ఎండిపోవడంతో నాకు ఉన్న పశువులను మేపుతున్నాను. దీనికి తోడు సాయంత్రం వేళ 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు కరెంట్ తీస్తున్నారు 10గంటల తర్వాత కరెంట్ వస్తుండడంతో కొన్నిమార్లు ఫ్యూజ్‌వైర్లు పోయి బోరుమోటర్లు నడవని పరిస్థితి ఉంటుంది.

4 బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి

రైతు ధరావత్ బధ్య నాయక్, భీమ్లా తండా గ్రామం



ఎండకాలం రాకముందే బోరుబావుల్ల నీళ్లు కిందకు పోయాయి. బోరుబావుల్ల నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయి. మొన్నటి వరకు చెరువు, కుంటల్ల నీళ్లు ఉండడంతో బోరుబావుల్ల నీళ్లు ఉండేవి. ఇప్పుడు చెరువు, కుంటలల్లో నీళ్లు లేవు. ఎండిన చెరువు, కుంటల్ల నీళ్లు నింపితే బోరు, బావుల్లో నీళ్లు ఉండేది. 20సంవత్సరాలనుండి వ్యవసాయం చేస్తున్నాను. ఇలాంటి పరిస్థితి ఇంతవరకు రాలేదు. మూడు బోర్లు తగ్గిపోయాయి. గతంలో 6 పైపుల మీద పోసిన నీళ్లు ఇప్పుడు 14 పైపులు దించినా పోయడం లేదు. 8 ఎకరాలు వరి సాగు చేశాను. ఇప్పటివరకు 3 ఎకరాలు ఎండిపోయింది. బోర్లు పోయక పోవడంతో అది కూడా ఎండిపోయే పరిస్థితి ఉంది.

పొలంలో పశువులను మేపుతున్నాను

రైతు ధరావత్ భాస్కర్ , భీమ్లా తండా



ఎండిన వరిపొలంలో చేసేది ఏమిలేక బర్లను మేపుతున్నాము. పెట్టుబడి కోసం అప్పు చేసినం పంట చేతికి రాకుండా ఎండిపోతే అప్పులు ఎలా తీర్చాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎస్సారెస్పీ కాల్వలకు నీళ్ల వదిలి చెరువు, కుంటల్ల నీళ్ల నింపాలి. ఎండిన పంటకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి రైతన్నలను ఆదుకోవాలి.



ఎండిపోతున్న పంట పొలాలు

నవతెలంగాణ-అర్వపల్లి



మండలంలో నీళ్ల లేక, మరోవైపు ఎండతీవ్రతకు తట్టుకోలేక వరిచేలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు ,బావిలో నీళ్ల అడుగంటిపోయాయి. దీ మరోవైపు పంట పొలాలు ఎస్సారెస్పీ కాల్వ కింద భూములకు నీరందకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి.

చేతికొచ్చిన పంట ఎండిపోయింది , రైతు గోవర్‌రెడ్డి

నోటి కాడికి వచ్చిన వరికి పంట కాస్త పశువులను మేపే పరిస్థితి వచ్చింది. పది ఎకరాల్లో వరిసాగు చేశాను. నీళ్ల లేక పంట పూర్తిగా ఎండిపోయింది. చేసేదేమీలేక పశువులను మేపుతున్నాను.



ఎస్సారెస్పీ కాల్వ ద్వారా గోదావరి జలాలు రాక ఎండిపోయింది

-జక్కుల రవి రైతు

నవతెలంగాణ-నూతనకల్



తమకున్న సాగు విస్తీర్ణంలో 6 ఎకరాల వరి పంట సాగు చేశాను పూర్తిగా పెట్టుబడి పెట్టి పొట్ట దశకు వచ్చేసరికి ఎస్సారెస్పీ కాల్వ ద్వారా గోదావరి జలాలు రాకపోవడంతో భూగర్భ జలాలు తగ్గి బావులు ఎండిపోయి బోర్లు సగం మాత్రమే పోయడం ద్వారా మూడు ఎకరాల పొలం ఎండిపోయింది. పశువులు మేపడం జరుగుతుందని తెలిపారు. ఎకరాకు సుమారు 30 వేల పెట్టుబడి పెట్టిన. ఎండిపోవడంతో పూర్తిగా నష్టం వాటిల్లింది. ప్రజాప్రతినిధులు ,అధికారులు స్పందించి చివరి ఆయకట్టు వరకు నీటిని విడుదల చేయాలి.

ఇంటర్, పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అధికారులతో కోరారు. సోమవారం అయన తన చాంబర్లో ఇంటర్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ విషయమై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్చి 5 నుండి మార్చి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ,మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుండగా, పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు జరగనున్నాయి.నల్గొండ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను 28722 మంది విద్యార్థులు రాయనుండగా, పదవ తరగతి పరీక్షలను 18666 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు.ఇంటర్ పరీక్షల కోసం 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, పదవ తరగతి పరీక్షలకు 105 రెగ్యులర్ కేంద్రాలు,3 ప్రైవేటు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు అదనపు కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు పలు సూచనలను, ఆదేశాలను జారీ చేస్తూ...పరీక్షల సందర్భంగా 144 వ సెక్షన్ విధించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేయాలని, జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్ ,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, విద్యు త్ ,మెడికల్, ఆర్టీసీ, ట్రాన్స్పోర్ట్, సమాచార, పోస్టల్, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులుపాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ప్రజావాణి ఫిర్యాదులను సమీక్షిస్తూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పై జిల్లా, మండల ,గ్రామస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సోమవారం 67 మంది ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను అదనపు కలెక్టర్ కు, జిల్లా అధికారులకు సమర్పించారు. ఈ సోమవారం వ్యక్తిగత అంశాలు, రెవెన్యూ ,భూములకు సంబంధించిన అంశాలకు సంబంధించిన వాటిపై ఫిర్యాదులు ఉన్నాయి. ఇన్చార్జి డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు.



రైస్ మిల్లర్లతో సమావేశం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రైస్ మిల్లర్లతో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వీరారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల పై ఆదేశాలు జారీ చేశారు. రబీ 2023-24 సిఎంఆర్ డెలివరీ బియ్యం 85శాతం పూర్తి చేసినారనీ, మిగిలిన 15శాతం మార్చి 17లోగా పూర్తిచేయాలని లేనియెడల 25శాతం జారిమానా విధించనున్నట్లు తెలిపారు. జిల్లాకు కేటాయించిన 1000 టన్నుల బియ్యం ఫిలిప్పీన్స్ దేశానికి 5శాతం నూకతో సరఫరా గడువు ఫిబ్రవరి 28వ లోపు పూర్తి చేయాలని సూచించారు. 1250 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 10శాతం నాన్ ఎఫ్ ఆర్ కే బ్రోకెన్ రైస్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి మార్చ్ 5వ తేదీ లోపు అందజేయాలన్నారు. ఖరీఫ్ 2024-25 పంటకాలపు బ్యాంక్ గ్యారెంటీలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కె వనజాత, సహాయ పౌరసరఫరాల అధికారి రోజారాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు హరికృష్ణ, ఉప తహశీల్దారు (పౌరసరఫరాలు), జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు మార్తా వెంకటేశం, ఇతర మిల్లర్లు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు,ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవోకు వినతి

నవతెలంగాణ-మిర్యాలగూడ



ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలో ఉన్న 8,350 లక్షల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయకపోవడం వల్ల స్థానికంగా ఉన్న డిగ్రీ కళాశాల యజమాన్యం విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తేనే ఇంటర్నల్ హాల్ టికెట్ ఇస్తామని హెచ్చరించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు పేద విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు చెందిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ మీద ఆధారపడి విద్యను కొనసాగిస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలనే ఎజెండాతో ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయట్లేదని తెలియజేశారు ఇదే విషయం అదునుగా తీసుకొని ప్రభుత్వ కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఇబ్బందులు గురి చేస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జగన్ వీరన్న నాయకులు అఖిల్ అనిల్ మనీ రాజేష్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగ నైపుణ్యాలను నేర్పించాలి

జిల్లా విద్యాధికారి సత్యనారాయణ

నవతెలంగాణ-బీబీనగర్



విద్యార్థులకు ప్రయోగశాలలో ఉన్న పరికరాలు ఉపయోగించి ఉపాధ్యాయులు ప్రయోగ నైపుణ్యాలను నేర్పించాలని జిల్లా విద్యాధికారి కె. సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అమెరికన్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైన్స్ ,టెక్నాలజీ, ఇంజనీరింగ్, అండ్ మ్యాథమాటిక్స్ ల్యాబ్, ఇన్నోవేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రయోగశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ప్రయోగశాలలో ఉన్న పరికరాలు ప్రొజెక్టర్లు త్రీడీ ప్రింటర్, ల్యాబ్ టాప్, మైక్రోస్కోప్ తో పాటు వివిధ రకాలైన స్పేస్ సెంటర్, పరికరాలను గణితం, ఫిజికల్ సైన్స్, భౌతిక రసాయన శాస్త్ర, జీవశాస్త్ర మోడల్స్ ఇతర పరికరాలను పరిశీలించి వాటి యొక్క పని విధానాన్ని పిల్లల చేత అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ విద్యార్థులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర ప్రేమ జ్యోతి, జె శ్రీనివాస్, మండల విద్యాధికారి సురేష్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ కె విజయలక్ష్మి, అమెరికన్ ఇండియా ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ మాలిక్, ప్రతినిధులు షేన్ స్వాతి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నింపేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి

నవతెలంగాణ-మునుగోడు

బ్రాహ్మణ వెళ్లాంల ప్రాజెక్టు ద్వారా మునుగోడు మండలంలోని చెరువులను నింపేందుకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవ చూపాలని అక్షరం ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కోడి రాములు విజ్ఞప్తి చేశారు. సోమవారం మునుగోడు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఇటీవల నల్గొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల చెరువులను నింపేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ఇందులో భాగంగానే నల్లగొండ మండలంలోని పలు చెరువులను నింపుతున్నారని తెలిపారు. చిట్యాల మండలం ఎలికట్టే మీదుగా కిస్టాపురం వరకు ప్రధాన కాలువ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రాజెక్టు నీటితో చెరువులు నింపాలని విజ్ఞప్తి చేశారు. కిష్టాపురం చెరువు నుండి ఇప్పర్తి తాళ్ల వెల్లంల మునుగోడు పెద్ద చెరువు తో పాటు పులిపలుపుల గూడపూర్ చెరువులను గొలుసు కట్టు విధానం ద్వారా నింపే అవకాశం ఉంటుందన్నారు. చెరువులు నింపడం వలన భూగర్భ జలాలు పెరగడంతో బోర్ల ద్వారా సాగు చేసే రైతులకు మేలు కలుగుతుందన్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల రైతులు తమ పొలాలకు నీళ్ల ట్యాంకర్ల ద్వారా పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే విద్య వైద్యం రవాణా అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టుగానే సాగునీటి విషయంపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

రాచకొండ ఉర్సు ప్రారంభం

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

రాచకొండ గుట్టలోని హజరత్ గాలిబ్ షహిద్‌దర్గా వద్ద 4 రోజుల పాటు నిర్వహించే ఉర్సు ఉత్సవాలను సోమవారం మండల కేంద్రాల్లో గంధం ఊరేగింపుగా ప్రారంభించారు. మండల కేంద్రంలోని చిన్న మసీదు నుండి గంధం డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దోనూరు జైపాల్ రెడ్డి, కరంటూతు బిక్షపతి నాయక్, శ్రీను నాయక్, ఉప్పల లింగస్వామి, వాంకుడోత్ బుజ్జి, శ్రీ రమ్ నాయక్, ఏర్పుల సుదర్శన్, ఎండి రహీమ్ షరీఫ్, ముతవల్లి మహమ్మద్ గులాం నబీ, ఎండి హల్తాఫ్, ఇమ్రాన్, ఉస్మాన్, సులేమన్ నవాబ్, ఎండి రహీం షరీఫ్, అగ్బర్ అలీ పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాల లో ఘనంగా సరస్వతి పూజలు

నవతెలంగాణ-నాగర్జునసాగర్

నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్మించిన సరస్వతి దేవి దేవాలయంలో సోమవారం ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఆలయాన్ని నిర్మించి 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, హెూమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఏటీపీ గాయత్రి ఇతర ఉపాధ్యాయులు, పద్మయ్య దంపతులు, జేబీ కృష్ణమూర్తి, సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని మల్యాల గ్రామంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, బొమ్మలరామారం మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయుల నియోజకవర్గ బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చిమ్ముల రవీందర్ రెడ్డి, వేముల నరేష్, రంగ రామా గౌడ్, బాలరాజ్ గౌడ్, పాములపర్తి నరేష్ చారి, మహేష్ గౌడ్, ఎలబోయిన రవిశంకర్, గుండ్ల గోపాల్, బొల్లంపల్లి నర్సింహారెడ్డి, జగర్ల ఆనంద్ గౌడ్, భీమరి రాజు, జూపల్లి సాయి, ఎల్లబోయిన భాస్కర్, గులారి నరసింహ, డాక్టర్ పాండు తదితరులు పాల్గొన్నారు.

ట్రాలెంట్ టెస్ట్‌లు విద్యార్థులకు ఉపయోగకరం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

టాలెంట్ టెస్టులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, జనని స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పేరపు ఆనంద్ అన్నారు. ఆలేరు మండల కేంద్రంలో సోమవారం సంస్థ సమావేశం సభ్యులచే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ 2025 10వతరగతి విద్యార్థులకు చక్కని అవకాశమని, విద్యార్థులందరూ టాలెంట్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ మొదటి బహుమతిగా మనీ ప్రైస్ రూ.3016, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రతి విద్యార్థికి పాటిస్పేట్ సర్టిఫికెట్ ఇవ్వబడునని అన్నారు. వేదిక వీఆర్ జూనియర్ కళాశాల ఆలేరు ఉదయం 10 గంటలకు నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మైదం భాస్కర్, ప్రధాన కార్యదర్శి మద్దూరు శ్రీకాంత్, కోశాధికారి ఆలేటి శ్రీకాంత్, ముంత శరత్ ,జూకంటి సంపత్ పడకండి చంద్రశేఖర్, జూకంటి కృష్ణ ,గుజ్జ ఉదయ్ కుమార్, సునీల్, శ్రీశైలం రమేష్, గణేష్ సురేష్, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

'మా బతుకుదెరువును ఆగం చేయొద్దు'

నవతెలంగాన-చిట్యాల

మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు సోమవారం తమ బతుకు దెరువును ఆగం చేయవద్దని తహసీల్దార్ జి.కృష్ణా కు వినతి పత్రం అందజేశారు. వెలిమినేడు గ్రామంలో మరో నూతన కంపెనీ నిర్మాణ పనులలో భాగంగా కంపెనీ యాజమాన్యం పెద్దకాపార్తి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్లతో కలిసి అదే గ్రామం నుండి టిప్పర్ల ద్వారా మట్టిని పోయించుకోవడం జరుగుతుంది. దీని ద్వారా ట్రాక్టర్ నడుపుకొని జీవనోపాధి పొందే 200 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని వాపోయారు. దాదాపుగా గ్రామంలో ఉన్నటువంటి అన్ని కంపెనీలు తమకు ఉపాధి కల్పించారని ఇప్పుడు నిర్మించబోయే కంపెనీ వారు మాత్రం దీనికి భిన్నంగా మాకు ఉపాధి కల్పించకుండా టిప్పర్ల ద్వారా మట్టి పోయించుకొని మా బతుకులపై మట్టి చల్లుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఊరునే నమ్ముకొని ట్రాక్టర్లు నడుపుకుంటున్న 200 కుటుంబాలకు తగిన న్యాయం జరిపించాలని కోరారు.

స్వపరిపాల్లనా దినోత్సవం

చిట్యాల: పట్టణంలోని న్యూ లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ లో సోమవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలలోని విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత విద్యాధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అతుల్య అక్షయ్, అనంతుల వెంకన్న, నర్రా భిక్షం రెడ్డి,శాలిని, శ్రీలక్ష్మిసబిత, సుచరిత, జ్యోతి, పూర్ణకళ, లావణ్య, లలిత, విజయలక్ష్మి, రెజి, సొసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి, ఒకరి పరిస్థితి విషమం

- **కల్తీ మద్యమా.!...పక్కా ప్లానా..?**

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిత్రులలో కలిసి రాత్రి మద్యం సేవించగా రక్తపు వాంతులతో ఒకరు మృతి చెందిన అనుమానాస్పద సంఘటన మిర్యాలగూడ పట్టణంలో సోమవారం వెలుగు చూసింది.... భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. బాధితులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని వినోబా నగర్ కు చెందిన కోడి రెక్క సంపత్ కుమార్ (32) ప్రైవేట్ సంస్థలో ఫైనాన్స్ రికవరీ ఏజెంట్‌గా పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి అతని మిత్రులైన ఆర్‌ఎంపీ డాక్టర్ అయిన ఎండి గౌస్ అలీ పరిస్థితి విషమంగా వుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెడ్డి మాస్ యశ్వంత్, గురజాల బాలరాజు, పొదిళ్ల అన్వేష్ లు కలిసి ముత్తిరెడ్డి కుంటలోని ఓ బెల్ట్ షాపులో మద్యం సేవించినట్టు తెలిపారు. అనంతరం కోడి రెక్క సంపత్, గౌస్ అలీలు అర్ధరాత్రి విపరీతంగా రక్తపు వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు తొలుత మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రి కి,ఆపైన మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రి లలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ కోడి రెక్క సంపత్ మృతి చెందగా, అపోలో ఆసుపత్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్న గౌస్ అలీ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. కాగా సంపత్ కుమార్ మృతి పై భార్య రమ్య పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తన భర్త తాగింది కల్తీ మద్యం అయి ఉండవచ్చు అని, లేదా ఎవరైనా పథకం ప్రకారం వారిపై ఏదైనా చేసి ఉండవచ్చు అని అభిప్రాయం వ్యక్తం చేస్తుంది. రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగలైన దంపతుల అరెస్ట్



- **97తులాల9 గ్రాముల బంగారం, సెల్ పోన్**

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలోని సుందర్ నగర్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగలైన దంపతులు వేముల కోటేష్,మాతంగి కృష్ణవేణి లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 97తులాల 9 గ్రాముల బంగారం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సిఐ పి. నాగార్జున, రూరల్ సీఐ కె.వీరబాబులు తెలిపారు. సోమవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. 2010 నుండి మిర్యాలగూడ పట్టణానికి చెందిన కోటేష్ ,కృష్ణవేణి దంపతులు దొంగతనాలు చేయడం ప్రారంభించారు. పగలంతా రిక్కీ నిర్వహించి రాత్రి సమయంలో ఇళ్లను దోచేయటం వీరి అలవాటుగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ పోలీస్ స్టేషన్లో నిందితులపై 37 కేసులు నమోదయ్యాయి. 2024 మార్చి నెలలో వీరిని పలు కేసుల్లో కోర్టులో రిమాండ్ చేయగా, జులై నెలలో బయటికి వచ్చిన వీరు వివిధ ప్రాంతాలలో కూలి పనులు చేస్తూ బస్సుల్లో రైళ్లలో తిరుగుతూ పలుచోట్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. సోమవారం నగరంలో కూడా దొంగతనం చేసేందుకు వచ్చారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పారిపోతుండగా పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుల వద్ద బంగారాన్ని సెల్ఫోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్టు తెలిపారు. కేసును చేకచ కింద చేదించిన మిర్యాలగూడ టూ టౌన్ సిఐ పి నాగార్జున రూరల్ సీఐ కె వీరబాబు, ఎస్ఐ రాంబాబు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు,పిసి లు రామకృష్ణ, ఎండి అక్బర్ లను మిర్యాలగూడ డి.ఎస్.పి కె రాజశేఖర్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

వెంటనే ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలి

నవతెలంగాణ-మునగాల

లబ్దిదారులు వెంటనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి గౌతమ్ సూచించారు. సోమవారం పైలెట్ గ్రామంగా ఎంపికైన తాడువాయిలో ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే ఇండ్లను నిర్మించుకోవాలన్నారు. లబ్దిదారుడు సొంత స్థలం లేక ప్రభుత్వం ఇచ్చిన స్థలమైనా వుండాలన్నారు. లబ్దిదారుడు సొంత గ్రామంలో కాని లేదా అర్బన్ ఏరియాలోకాని తప్పకుండా నివాసం వుండాలన్నారు. 400 చదరపు అడుగులు కంటే తక్కువ కాకుండా ఇంటిని నిర్మించుకోవాలన్నారు. ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా మధ్యవర్తులను ఆశ్రయించవద్దన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం ప్రభు త్వం నిధులను సిద్ధం చేసిందన్నారు. బేస్‌మెంట్ పూర్తి కాగానే లక్ష, గోడల లెవల్ వచ్చిన తరువాత మరో లక్ష, స్లాబ్ అయిన తర్వాత రెండు లక్షలు, ఇల్లు పూర్తయిన తరువాత మరో లక్ష, మొత్తం 5లక్షలు అందిస్తుందని తెలిపారు. లబ్దిదారుల ఖాతాలోనే ప్రభుత్వం నుండి అమౌంట్ జమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శిరీష, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, మండల తహసిల్దార్ వలిగొండ ఆంజ నేయులు, ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, హౌసింగ్ ఎఈ మూర్తి, ఆర్ఐ నారపరాజు రామారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాము పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కోదాడటౌన్

రాష్ట్రంలోనే కోదాడ విశ్రాంత ఉద్యోగుల సంఘం అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల. సీతారామయ్య అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ భవన్ లో 23వ జన్మదిన వేడుకలను కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఫిబ్రవరి నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల పుట్టినరోజు వేడుకలను సామూహికంగా కేక్ కట్ చేసి ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనందంగా, సంతోషంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిదని ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కోదాడ సంఘం వారు చేసే కార్యక్రమాలను చూసి రాష్ట్రవ్యాప్తంగా ఇతర పెన్షనర్లు అనుసరిస్తున్నారని ఇది తమ సంఘానికి ఎంతో గర్వకారణం అన్నారు. అనంతరం పుట్టినరోజు జరుపుకుంటున్న వారిని శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, బొల్లు రాంబాబు, రఘువర ప్రసాద్, హనుమారెడ్డి, విద్యాసాగర్, పొట్ట జగన్మోహన్ రావు, వెంకటేశ్వరరావు, వరప్రసాద్, భ్రమరాంబ, బిక్షం పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయం ముస్తాబు

నవతెలంగాణ-నకిరేకల్

ఈనెల 26న మహాశివరాత్రి ఈ సందర్భంగా జరిగే వేడుకలకు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి శివరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్ తెలిపారు. ఈనెల 25 న ఉదయం 6:30 గంటలకు మూలవిరాట్ కు అభిషేకము, గణపతి పూజ, స్వస్తివాచనం, మండపారాధన, విగ్రహమూర్తులకు అలంకరణ, రుద్ర హెూమం, 26న శివరాత్రి న ఉదయం ఐదు గంటలకు మూల విరాట్ కు వివిధ రకాల పంచామృతలతో ఫల రసాలతో అభిషేక కార్యక్రమం, తదనంతరం భక్తులచే సామూహిక అభిషేక కార్యక్రమాలు, సాయంత్రం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తలపాగా ఊరేగింపుగా తీసుకొని వచ్చుట, 8:30 గంటలకు నటరాజస్వామి శివుడికి నందీశ్వరుడికి అభిషేకం, రాత్రి 11:30 గంటలకు లింగోద్భవ సమయంలో మూలవిరాట్ కి అభిషేకం, ఎదుర్కోలు, కళ్యాణం జరుగుతుందని తెలిపారు. 27న ఆంజనేయస్వామికి సింధూరభిషేకము, నకిరేకల్ పురవీధులలో స్వామి ఊరేగింపు ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమాలలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొంటారని వివరించారు.

షోటో ఖాన్ కరాటే పోటీల్లో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో తుంగపాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్. రంజిత తెలిపారు. మండల పరిధిలోని తుంగపాడు గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కరాటే పోటీల్లో పథకాలు సాధించిన విద్యార్థులను ఆమె, పాఠశాల అధ్యాపక బంధం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లగొండలో ఈనెల 23న జపాన్ కరాటే అసోసియేషన్ ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమీ నల్లగొండ ఆధ్వర్యంలో ఫోటో ఖాన్ తెలంగాణ స్టేట్ చాంపియన్షిప్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులైన సిహెచ్, జ్యోతిక, వర్షిని, ఎల్ అంజలి లు ప్రథమ స్థానంలో రాణించి బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా సాత్విక, భావన, అక్షయ, రితికలు ద్వితీయ స్థానంలో రాణించడంతో ఆనందంగా ఉందన్నారు. కరాటే మాస్టర్ బంటు రామారావు మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శీ లక్ష్మీ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని పన్నాలగూడెంలో మహేష్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మి డయాగ్నస్టిక్ సెంటర్ ను సోమవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.